

నేడు విద్యాలయాలకు సెలవు

వర్షాల ప్రభావం సోమవారం కూడా ఉండటంతో రాష్ట్ర ప్రభుత్వం విద్యాలయాలకు సెలవు ప్రకటించింది. దీంతో జిల్లాలోను ముందస్తు చర్యలలో భాగంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలకు సోమవారం సెలవును ప్రకటిస్తూ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.





జిల్లా ఆస్పత్రిలో ఓపీ కోసం బారులు తీరిన రోగులు



జ్వరంతో మరణించిన ఇల్లూరుకు చెందిన వన్నూరుస్వామి



ఐసీయూలో చికిత్స పొందుతున్న ఇల్లూరు అబ్దుల్లా

● గార్లదిన్నె మండలం ఇల్లూరు గ్రామానికి చెందిన వన్నూరుస్వామి(40)ఆయన కుమారుడు 15 ఏళ్ల అబ్దుల్లా వారం రోజులుగా జ్వరంతో బాధపడుతున్నారు. చికిత్స కోసం తండ్రీ కొడుకులను జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి రెండురోజులు క్రితం తీసుకొచ్చారు. వన్నూరుస్వామి పరిస్థితి విషమంగా ఉందని చెప్పడంతో నగరంలోని రాంనగర్‌లోని ఓప్రైవేటు ఆస్పత్రికి తీసికెళ్లారు. అక్కడ వైద్యులు చేతులెత్తేయడంతో మెరుగైన చికిత్సకోసం బెంగళూరుకు శనివారం తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. కొడుకు అబ్దుల్లా మాత్రం ఇంకా జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలోని ఐసీయూలో చికిత్స పొందుతున్నాడు. వీరిద్దరికీ కూడా డెంగీ జ్వరం సోకినట్లు వైద్యులు తెలిపారని కుటుంబ సభ్యులు వెల్లడించారు.

పాడు జ్వరం

జిల్లాలో విజృంభిస్తున్న డెంగ్యూ

వారంలోనే నలుగురి మృతి

కొట్టి పారేస్తున్న వైద్యాధికారులు

విషజ్వరాలతో జనం విలవిల

మాటలకే పరిమితమైన నివారణ చర్యలు

● ఆగస్టు 26న కణేకల్లు మండలం యర్రగుంట గ్రామానికి చెందిన ముజ్బా కౌసర్(9) అనే బాలిక తీవ్ర జ్వరంతో బాధపడుతుండగా తొలుత కణేకల్లు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడసరిగా పట్టించుకోలేదని బళ్లారికి తరలించగా ఆబాలిక మృతి చెందింది, అక్కడ డెంగీ ఫీవర్ అని చెప్పినట్లు బాలిక కుటుంబసభ్యులు చెబుతున్నారు.

● ఆగస్టు 28న ఉరవకొండలోని ఒకటో వార్డుకు చెందిన అజీమ్(14) అనే బాలుడు జ్వరంతో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చనిపోయాడు. ఈ అబ్బాయికి డెంగీ అని బాధిత కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.

● డీ.హీరేహాళ్ మండలం మురడి గ్రామానికి చెందిన శివగంగమ్మ తీవ్ర జ్వరంతో బాధపడుతుండగా వైద్యం కోసం బళ్లారికి తీసుకెళ్లారు. అక్కడ ఆమె చికిత్స పొందుతూ మృతి చెందారు. భార్య మృతిని తట్టుకోలేక భర్త పంపాపతి గుండెపోటుకు గురై మరణించాడు.



నిరంతరం పర్యవేక్షిస్తున్నాం

జ్వరాల విషయంలో జిల్లావ్యాప్తంగా అప్రమత్తంగా ఉంటు న్నాం. జిల్లా అధికారులతో పాటు డివిజన్, క్లస్టర్ విభాగాల వైద్యాధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకుంటూ ప్రజల ను అప్రమత్తం చేస్తున్నాం. డెంగీ, మలేరియా కేసుల ఎక్కడైనా వచ్చాయని తెలిస్తే ఆప్రాంతాలలో ప్రత్యేక చర్యలు తీసుకుంటు న్నాం. అవసరమైన డాక్టర్లు, సిబ్బంది, మందులు అన్నీ ఉన్నాయి. డెంగీ జ్వరం అని చెప్పి, రోగులను భయపెట్టి వారి ప్రాణాలతో చెలగాటమాడే ప్రైవేట్ ఆస్పత్రులపై చర్యలు తప్పవు. -డాక్టర్ ఈబీ దేవి, డీఎంహెచ్ఓ



అనంతపురం టౌన్, సెప్టెంబరు 1: జిల్లాలో డెంగీ విజృంభిస్తోంది. వారంలోనే నలుగురు జ్వరంతో మరణించారు. డెంగీ జ్వరంతో చనిపోయారని కుటుంబసభ్యులు అంటున్నా, జిల్లా వైద్యాధికారులు మాత్రం అవి డెంగీ మరణాలు కావని కొట్టి పారేస్తున్నారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా పరిశుభ్రత అధ్వానంగా మారింది. దీంతో దోమలు బెడద ఎక్కువైపోయింది. ఇంట్లో, బయట ఎక్కడ కూర్చున్నా, పడుకున్నా దోమలు దాడి చేస్తున్నాయి. ఈ పర్యవసానంగా జనం విషజ్వరాల బారిన పడి విలవిల లాడిపోతున్నారు. ఈ నేపథ్యంలో డెంగీతో అక్కడక్కడ మరణాలు సంభవిస్తున్నాయనే ప్రచారం జరుగుతుండటంతో జనం తీవ్ర ఆందోళన చెందుతు న్నారు. వైద్యఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్, కలెక్టరు వినోద్ కుమార్ సమీక్షలు, కాన్ఫరెన్స్‌లు పెట్టి జిల్లాలో వ్యాధులు ప్రబల కుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశిస్తున్నా అవి ప్రకటనలకే పరిమితమవుతున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నా యి.

ఎక్కడ చూసినా జ్వరపీడితులే

పల్లె, పట్టణం అన్న తేడా లేకుండా ఎక్కడచూసినా జ్వరపీడితులు కనిపిస్తున్నారు. పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, జిల్లా ఆస్పత్రితోపాటు ఇతర ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స కోసం జ్వరబాధితులు క్యూ కడుతున్నారు. జిల్లా ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి రోజుకు 1600నుంచి 2వేల వరకు వివిధ రకాల వ్యాధులతో బాధపడుతూ చికిత్స కోసం వస్తున్నారు. వీరిలో అత్యధికులు జ్వర పీడితులే. జిల్లా ఆస్పత్రి వైద్యులు చెబుతున్న లెక్కల ప్రకారం 300 నుంచి 400మంది వరకు జ్వరం, జలుబు, దగ్గుతో చికిత్సకు వస్తున్నారు. ఆతర్వాత కీళ్లనొప్పులతో ఎక్కువ మంది చికిత్స కోసం వస్తున్నారని చెబుతున్నారు. జిల్లా ఆస్పత్రిలో దాదాపు 1200 మంది అడ్మిషన్ పొందుతుండగా వీరిలో 200 మందికి పైగా జ్వరాలు, జలుబు, దగ్గు, వళ్ల నొప్పులతో బాధపడేవారేనని ఆస్పత్రి గణాంకాలు చెబుతున్నాయి. జిల్లా ఆస్పత్రిలోనే ఈపరిస్థితి ఉంటే మండల, నియోజకవర్గ ప్రభుత్వ ఆస్పత్రులు ప్రైవేట్ ఆస్పత్రుల్లో పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు కానీ జిల్లా వైద్యశాఖ మాత్రం డెంగీ, మలేరియా కేసులు తక్కువ సంఖ్యలో చూపుతూ ఉన్నతాధికారులను కనికట్టు చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

వారు డెంగీతో చనిపోలేదు



జిల్లాలో ఇటీవల మరణించిన ఆ నలుగురు డెంగీతో చని పోలేదు. మురడి, యర్రగుంట, ఉరవకొండ, ఇల్లూరు మరణాలపై ఆరాతీశాం. వారు జ్వరంతో బాధ పడుతున్నారన్న విషయం వాస్తవమే. అయినా వారికి ఇతర ఆరోగ్య సమస్యలుండటంతో మృతి చెందినట్లు సమాచారం. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అబ్దుల్‌ను స్వయంగా డీఎంహెచ్ఓతో కలిసి చూసొచ్చాం. మలేరియా, టైఫాయిడ్ కాదని తేలింది. డెంగీ టెస్టుకు పంపించాం. ఆ నివేదికలు వచ్చిన తర్వాత విషయం తెలుస్తుంది, ప్రైవేట్ ఆస్పత్రులలో ఎన్ఎస్-1 పరీక్షలు చేసి డెంగీ అనిచెప్పి భయపెట్టి చికిత్స చేసి ఫీజులు దండుకుంటున్నారు. అనంత వైద్య కళాశాలలో మాత్రమే డెంగీ నిర్ధారణ పరీక్షలు చేస్తారు. అనుమానిత లక్షణాలు ఉంటే ఇక్కడకు పంపిస్తే పరీక్షలు చేయిస్తాం. వాస్తవ సమాచారం చెబుతాం. -డాక్టర్ ఓబులు, డీఎంఈ

కేసులు తక్కువేనట!

జిల్లా వైద్యశాఖ డెంగీ కేసులలో వింతనాటకం ఆడుతోంది. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు కేవలం 57కేసులు నమోదయ్యాయట. వారు చెప్పిన ప్రకారం జనవరిలో 8, ఫిబ్రవరిలో 5, మార్చిలో 12, ఏప్రిల్‌లో 6, మే 3, జూన్‌లో 3, జూలైలో 9, ఆగస్టులో 10, సెప్టెంబరులో 1 డెంగీ కేసు నమోదైంది. అయితే గత వారంలోపే జిల్లాలో నలుగురు మృతి చెందారు. వారంతా డెంగీ జ్వరంతో చనిపోయినట్లు ఇతర ప్రాంతాల్లో చికిత్స చేసిన డాక్టర్లు, బాధిత కుటుంబసభ్యులు చెబుతున్నారు. కానీ వీరు డెంగీ జ్వరంతో మరణించలేదని జిల్లా వైద్యశాఖ అధికారులు వాదిస్తున్నారు. ఇక మలేరియా కేసులు ఎనిమిది నెలల్లో కేవలం మూడే నమోదయ్యాయట. దీన్నిబట్టే జ్వరబాధితుల లెక్కల విషయంలో వైద్యశాఖ ఎంత నిబద్ధతగా వ్యవహరిస్తోందో అర్థం చేసుకోవచ్చు.

డయల్ 08554-277434

వైద్యసేవల కోసం ప్రత్యేక కంట్రోల్ రూమ్: డీఎంహెచ్ఓ

వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అవసరమైన వైద్యసేవలు అందించడం కోసం జిల్లాలో ప్రత్యేక కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేసినట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీదేవి ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఎక్కడైనా పాముకాటుకు గురైనా, గర్భిణులు ఇబ్బంది పడుతున్నా, విద్యుత్ ప్రమాదాలకు గురైనా, ఇతర ఏఅత్యవసర వైద్యసేవలు అవసరమైనా ఈ కంట్రోల్‌రూమ్‌కు ఫోన్ చేసి చెబితే వెంటనే అక్కడకు వైద్య బృందాన్ని పంపి చికిత్స అందిస్తామన్నారు. వైద్యసేవలు పొందాలంటే 08554-277434 నెంబర్‌కు ఫోన్ చేయవచ్చన్నారు. అన్ని పీహెచ్‌సీలలో పనిచేసే వైద్యులు, సిబ్బంది అక్కడే అందుబాటులో ఉండాలని లేకపోతే చర్యలు తప్పవని డీఎంహెచ్ఓ హెచ్చరించారు.

క్షేత్రస్థాయికి కలెక్టర్



పెద్దవడుగూరు మండలంలో వర్ష ప్రభావిత ప్రాంతాలను పరిశీలిస్తున్న కలెక్టర్

అనంతపురం టౌన్, సెప్టెంబరు 1: జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలతో ఎక్కడా ఎలాంటి సమస్య తలెత్తకుండా కలెక్టరు డాక్టర్ వినోద్‌కుమార్ నిరంతరం సిబ్బందితో మానటరింగ్ చేస్తున్నారు. జేసీ శివనారాయణశర్మ, డీఆర్ఓ రామకృష్ణారెడ్డి తో కలిసి శనివారం అర్ధరాత్రి దాటినా జిల్లాలోని వివిధ శాఖల యంత్రాంగంతో సమీక్షలు, కాన్ఫరెన్స్‌లు నిర్వహించి అధికారులను అప్రమత్తం చేశారు. ఆదివారం ఉదయం నుంచే మండల, గ్రామస్థాయి అధికారులు, ఉద్యోగులకు పలు ఆదేశాలు, సూచనలు చేస్తూ అవసరమైన చర్యలకు ఉపక్రమించారు. ప్రతి ఒక్కరు క్షేత్రస్థాయిలో ఉండాలని, ఆయా ప్రాంత ప్రజలకు వర్షాలపై అవగాహన కల్పించి ఎక్కడకు వెళ్లకుండా చూడాలని సూచించారు. కలెక్టరేట్, ఆర్డీఓ కార్యాలయాలలో కంట్రోల్‌రూమ్‌లు ఏర్పాటు చేయించారు. ఎక్కడైనా సమస్య వస్తే 8500292992, 9493188818, 63047 40949, 8333082895 నెంబర్లకు ఫోన్ చేసి తెలపాలని కలెక్టరు ప్రకటించారు. వర్షాలపై వాయిస్ మెసేజ్‌లు పంపుతూ అధికారులు, ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. ఈక్రమంలోనే నేరుగా క్షేత్రస్థాయి కి వెళ్లి పరిశీలన చేపట్టారు.

టమోటా కిలో రూ.20

అనంతపురంరూరల్, సెప్టెంబరు 1: కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.20తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. ఆదివారం 1500 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.14, కనిష్ఠ ధర రూ.6 పలికినట్లు ఆయన తెలిపారు.

కేసు సరే.. చర్యలేవీ?

● ఐసీడీఎస్‌లో అధికారుల ఉదాసీనత ● అక్రమ వసూళ్లకు తెగబడిన అంగన్‌వాడీ టీచర్ ● వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు



ఐసీడీఎస్ కార్యాలయం



ఎఫ్ఐఆర్ కాపీ

అనంతపురం విద్య, సెప్టెంబరు 1: పోస్టు ఇప్పిస్తానంటూ అక్రమ వసూళ్లకు దిగిన అంగన్‌వాడీ టీచర్‌పై సాక్షాత్తు ఐసీడీఎస్ జిల్లా అధికారులే వెనకడుగువేస్తున్నారు. పాతూరులోని ఓ అంగన్‌వాడీ టీచర్ ఏకంగా రూ.2.80 లక్షలు వసూలు చేయడంపై బాధితురాలు ఇటీవల ఉన్నతాధికారులను ఆశ్రయించింది. కలెక్టర్‌కు, ఎస్పీకి ఫిర్యాదు చేసినా, పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసినా, ఐసీడీఎస్ అధికారులు మాత్రం చర్యలకు దూరంగా ఉండటంపై విమర్శలు వస్తున్నాయి. ఐసీడీఎస్ సీడీపీఓ, పీడీ ఆఫీస్ అధికారులు మౌనంగా ఉండటంపై ఆరోపణలకు తావిస్తోంది.

వన్‌టౌన్ స్టేషన్‌లో కేసు నమోదు

నగరంలోని పాతూరులో ఓ అంగన్‌వాడీ కేంద్రం టీచర్‌పై బాధితురాలి ఫిర్యాదు మేరకు 20వ తేదీన వన్‌టౌన్‌లో కేసు నమోదైంది. సెక్షన్ 318(2)బీఎన్ఎస్ యాక్ట్ కింద ఎఫ్ఐఆర్ నమోదైంది. ఎలాంటి ఆధారాలు, సాక్ష్యాలు లేకుండా పోలీసులు కేసు నమోదు చేయరు. అంగన్‌వాడీ టీచర్ పోస్టు ఇప్పిస్తానంటూ తనతో విడతలవారీగా రూ.2.80 లక్షలు వసూలు చేసిందని బాధితురాలు లిఖిత పూర్వకంగా పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇతర ఆధారాలను పోలీసుల ఎదుట ఉంచింది. ధ్రువీకరించుకున్న పోలీసులు సదరు టీచర్‌పై కేసు నమోదు చేశారు. ఎఫ్ఐఆర్ నమోదైనా....ఐసీడీఎస్ అధికారులకు మాత్రం యూనియన్ లీడర్‌గా చెప్పుకునే ఆమె చేసిన అక్రమాలు, తప్పులు కనిపించడం లేదు. కలెక్టరేట్ వరకు ఫిర్యాదు వెళ్లిందన్న నెపంతో అంగన్‌వాడీ టీచర్‌కు చిన్న మెమో ఇచ్చి...సంజాయిషీ రాయించుకుని అంతా తూచ్ అన్నట్టు హైడ్రామా ఆడినట్టు విమర్శలు వస్తున్నాయి. అధికారుల ఉదాసీనతపై కలెక్టర్, ఐసీడీఎస్ రాష్ట్ర స్థాయి అధికారులు ఎలా స్పందిస్తారో చూడాలి.

వైభవంగా అంజన్న రథోత్సవం

బొమ్మనహాళ్, సెప్టెంబరు 1: మండలంలోని నేమకల్లు గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామి రథోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. ప్రతి ఏటా శ్రావణ మాసంలో ఆదివారం ఉదయం ఉత్సవం, రథోత్సవం జరిపిస్తారు. వేకువజామున స్వామివారి ఉత్సవాన్ని భారీ జనసందోహం మధ్య నిర్వహించారు. సాయంత్రం 4 గంటలకు రథోత్సవాన్ని నిర్వహించా రు. ఈ కార్యక్రమానికి రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ముఖ్య అతిథిగా హాజరై స్వామి వారికి పూజలు జరిపారు. అనంతరం రథాన్ని లాగారు.



రథాన్ని లాగుతున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు



స్వామివారి రథోత్సవం ఇన్‌సెట్‌లో ఆంజనేయ స్వామి

ఉపాధి హామీలో అక్రమాలు

• పనులు చేయకపోయినా చేసినట్లు నమోదు

• భారీ ఎత్తున నిధులు స్వాహా చేసిన అక్రమార్కులు

ఉరవకొండ, సెప్టెంబరు 1: ఉపాధి హామీ పథకం మండలంలో అక్రమార్కులకు వరంగా మారింది. ముఖ్యంగా బూదగవి గ్రామంలో రూ. లక్షల్లో అవినీతి జరిగింది. ఉపాధి సిబ్బంది ఆ గ్రామ వైసీపీ నాయకులతో కలిసి అవినీతికి పాల్పడ్డారు. ఉపాధి హామీలో చేపట్టిన ఫారంపాండ్ పనులలో ఈ అక్రమాలు చోటు చేసుకున్నాయి. కూలీలు పనులకు వెళ్లకుండానే, పని చేసినట్లు చూపి బిల్లులు స్వాహా చేశారు. ఇటీవల పనులు చేయకపోయినా రెండు ఫారం పాండ్ పనులను 30 మంది కూలీలతో చేయించినట్లు చూపి వారి పేరిట డబ్బులు డ్రా చేశారు. నాలుగు వారాలకు సంబంధించి రూ.2.10 లక్షలను కాజేశారు. ఇప్పుడున్న ఫీల్డ్ అసిస్టెంట్‌కు తెలియకుండానే డబ్బులు డ్రా చేయడం గమనార్హం. ఈ వ్యవహారంలో కంప్యూటర్ ఆపరేటర్, టెక్నికల్ అసిస్టెంట్, ఏపీవో, మాజీ ఫీల్డ్ అసిస్టెంట్ కుమ్మక్కై బిల్లులు డ్రా చేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో పనిచేసిన ఫీల్డ్ అసిస్టెంట్ జూన్ 5నే తన ఉద్యోగానికి రాజీనామా చేశాడు. కనీసం టెక్నికల్ అసిస్టెంట్ చెక్ మెజర్‌మెంట్ లేకుండా, ప్రస్తుత ఫీల్డ్ అసిస్టెంట్ రామాంజనేయులకు తెలియకుండానే వారే పేమెంట్ చేశారు. గ్రామంలో నడవలేని స్థితిలో ఉన్న ఓ దివ్యాంగుడు రోజూ పనికి వెళ్లినట్లు, అతడికి రోజుకు రూ.300ల చొప్పున ఆరు రోజులకు రూ. 1800కూలి చెల్లించినట్లు మస్టర్‌లో నమోదు చేశారు. అలాగే అదే గ్రామానికి చెందిన ఓ యువకుడు వేరే రాష్ట్రంలో చదువుల కోసం వెళ్లాడు. అయితే అతను ఉపాధి పనులు చేసినట్లు మస్టర్‌లో రాసి డబ్బులను మింగేశారు. అదేవిధంగా గ్రామంలో ఓ సామాజిక వర్గానికి చెందిన వారు పనులకు వెళ్లకపోయినా.. వెళ్లినట్లు చూపి వారిపేరు మీద కూడా డబ్బులను మింగేశారు. ఇక లత్తవరం తండాలో అంగన్‌వాడీ ఉద్యోగి పనులకు వెళ్లకపోయినా ఆమె ఖాతాలోకి డబ్బు జమ చేశారు. కొందరు ఈ విషయంపై అధికారులు దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు చేపట్టలేదు. ఉపాధి ఉన్నతాధికారులతో విచారణ జరిపిస్తే అక్రమాలు బయటకు వస్తాయని టీడీపీ నాయకులు పేర్కొంటున్నారు. ఈ విషయంపై ఎంపీడీఓ రామచంద్రను వివరణ కోరగా.. ఉపాధి హామీ పథకంలో అక్రమాలు జరిగాయని పీడీకి ఫిర్యాదు చేశారని, వాటిపై విచారణ చేస్తామని తెలిపారు.

30 మండలాల్లో వర్షం

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 1: జిల్లాలోని 30 మండలాల్లో శనివారం రాత్రి వర్షం పడింది. అత్యధికంగా పెద్దపప్పూరులో 22.6 మి.మీ వర్షపాతం నమోదైంది. ఉరవకొండ 13.2, గుత్తి 11.2, యాడికి 10.4, పెద్దవడుగూరు 9.8, కూడేరు, రాప్తాడు 8.4, గార్లదిన్నె 8.2, తాడిపత్రి 8.0, గుంతకల్లు, ఆత్మకూరు 7.4, యల్లనూరు 7.0, అనంతపురం 6.8, నార్పల 6.4, వజ్రకరూరు 6.2, కణేకల్లు 6.0 మి.మీ వర్షపాతం నమోదైంది. మిగతా మండలాల్లో 5.6 మి.మీలోపు వర్షపాతం నమోదైంది. ఆదివారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది. డి.హీరేహాళ్, ఉరవకొండ మండలాల్లో ఓ మోస్తరు వర్షం పడింది. అనంతపురం, గుంతకల్లు, గుత్తి, నార్పల, శింగనమల, తాడిపత్రి, పుట్లూరు, యాడికి, బెళుగుప్ప, పెద్దవడుగూరు తదితర మండలాల్లో చిరుజల్లులు పడ్డాయి.

వీళ్లకు బదిలీలు లేవా ?

మండలాధీశులుగా ఎంఈఓలు

ఏళ్ల తరబడి ఒకే మండలంలో తిష్ట

విద్యాశాఖలో రెగ్యులర్ ఎంఈఓలకు ట్రాన్స్‌ఫర్లు ఏవీ?

రాష్ట్రస్థాయిలో బదిలీలకు బ్రేక్ వేయిస్తున్న వైనం

జిల్లాలో 31 మండలాలకు 27 మంది..

అనంతపురం విద్య, సెప్టెంబరు 1: మండలాల్లోని ఎంపీడీఓలు, తహసీల్దార్లు, ఎస్ఐలు, ఇతర శాఖల నుంచి మండల స్థాయిలో పనిచేసిన అధికారులు రెండేళ్లు, మూడేళ్లకు బదిలీ అవుతుంటే ఎంఈఓ-1లు మాత్రం ఏడేళ్లు, 9 ఏళ్లు, 12 ఏళ్లుగా ఎక్కడి వారు అక్కడే ఉన్నారు. మండలాలను సొంత సామ్రాజ్యాలుగా మార్చుకుని మకుటం లేని మారాజుల్లా చెలరేగిపోతున్నారు. బదిలీ కాకుండా మండలాధీశులుగా మారిన మండల విద్యాశాఖాధికారుల వైఖరిపై చాలా మండలాల్లో ఉపాధ్యాయులు, సంఘాల నాయకులు గుర్రుగా ఉన్నారు. మెజార్టీ ఎంఈఓలను మార్చాలం టూ విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, సంఘాల నాయకులు, రాజకీయ నాయకులు సైతం కోరుతున్నారు. కానీ విద్యాశా ఖ ఆ దిశగా అడుగేసిన ప్రతిసారి కొందరు ఎంఈఓలు, సంఘాల నాయకులు రాష్ట్ర స్థాయిలో చక్రం తిప్పి బ్రేక్ వేయిస్తున్నారు.

కొందరికి రెండు మండలాల బాధ్యత

జిల్లావ్యాప్తంగా 31 మండలాలు ఉన్నాయి. 31 మండలాలకు 27 మంది మండల విద్యాశాఖాధికారులుగా వ్యవహరిస్తున్నారు. వీరిలో కొందరు ఎంఈఓలు రెండేసి మండలాలకు బాధ్యులుగా పనిచేస్తున్నారు. ముఖ్యంగా కణేకల్లు ఎంఈఓగా లక్ష్మణ్ణ వ్యవహరిస్తున్నారు. ఆయన డీ హీరేహాళ్ మండలానికి సైతం ఎఫ్ఏసీ ఎంఈఓగా పనిచేస్తున్నారు. రాయదుర్గం ఎంఈఓగా నాగమణి పనిచేస్తున్నారు. ఆమె గుమ్మఘట్టకు కూడా ఎఫ్ఏసీ ఎంఈఓగా వ్యవహరిస్తున్నారు. కళ్యాణదుర్గం ఎంఈఓగా పనిచేస్తున్న విజయకుమారి కంబదూరు మండలానికి ఎఫ్ఏసీ ఎంఈఓగా కూడా విధులు నిర్వర్తిస్తున్నారు. బ్రహ్మసముద్రం ఎంఈఓగా పనిచేస్తున్న ఓబుళపతి కుందుర్పి మండలానికి సైతం ఎఫ్ఏసీ ఎంఈఓగా వ్యవహరిస్తున్నారు.


జిల్లా విద్యాశాఖ కార్యాలయం


నార్పల మండల విద్యాశాఖ కార్యాలయం

స్థాన బలమే మిన్న..

మండలాల్లో ఎక్కువకాలం ఒకే చోట ఉండటం కొందరు ఎంఈఓలకు బలం చేకూరుస్తోంది. చాలా మంది 12 ఏళ్లు, ఏడేళ్లకు పైగా పాతుకుపోయారు. ఏళ్ల తరబడి బదిలీలు లేకపోవడంతో కొందరు ఎంఈఓలు స్థాన బలంతో చెలగేరిపోతున్నారు. ప్రైవేట్ స్కూళ్లకు ప్రతి ఏటా అరలక్ష, వీలైతే లక్ష రూపాయలు ఇలా ఫిక్స్ చేసి దండుకుంటున్నారన్న విమర్శలున్నాయి. ముఖ్యంగా నియోజకవర్గ కేంద్రాలు, నగరం, ప్రధాన పట్టణాలు మండల కేంద్రాలు ఉన్న ప్రాంతాల్లోని ఎంఈఓలు హవా సాగిస్తున్నారు. నిబంధనలు పాటించని కార్పొరేట్, ప్రైవేట్ స్కూళ్ల నుంచి ముక్కు పిండి ప్రతి ఏటా డబ్బులు లాగుతున్నారు. దీనికి తోడు స్కూళ్ల అనుమతులు, గుర్తింపు, రెన్యువల్ సందర్భాల్లో మరింత గుంజుతున్నారన్న ఆరోపణలు బలంగా ఉన్నాయి. ఇక ప్రభుత్వ రంగ విద్యాసంస్థల్లో ఉపాధ్యాయులు, ఇతర సిబ్బందికి సంబంధించిన వ్యవహారాల్లో మరీ చెప్పనక్కరలేదు. టీచర్లను సర్దుబాటు చేయడం, జీతాల నమోదు, మధ్యాహ్న భోజనం బిల్లులు, నాడు-నేడు పనులు, ఇతర అభివృద్ధి కార్యక్రమాల్లో చాలా మంది ఎంఈఓలు చేతివాటం ప్రదర్శిస్తున్నా రు. ఎక్కువ కాలం ఉన్నచోటే ఉండటం వల్ల పలువురు ఎంఈఓలు తమ పవర్ చెలాయిస్తూ పైరవీలు చేస్తూ లక్షలు పోగేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

బదిలీ భయమే లేదు...

విద్యాశాఖలో పలు మండలాల్లో పనిచేస్తున్న ఎంఈఓలు బదిలీలు మర్చిపోయారు. విద్యాశాఖ బదిలీలు నిర్వహించకపోవడమే కారణం. ముగ్గురు ఎంఈఓలు 12 ఏళ్లకు పైగా ఒకే మండలంలో పనిచేస్తుండగా, మెజార్టీ మండల విద్యాశాఖాధికారులు ఏడేళ్లకుపైగా అదే స్థానాల్లో కొనసాగుతున్నారు. అయితే అన్ని శాఖల్లో పనిచేస్తున్న అధికారులకు ఏదో ఒక ఏడాదిలో బదిలీలు వస్తూనే ఉన్నాయి. కానీ విద్యాశాఖ మాత్రం ఎంఈఓ-1 లకు బదిలీలు చేపట్టకపోవడంతో కొందరు ఇష్టారాజ్యంగా వ్యవహరి స్తున్నారు. చాలామంది స్థానికంగా ఉండటంతో పాటు, ఉపాధ్యాయ సంఘాల నేతలతో గ్రూపులు కట్టడం, స్థానిక రాజకీయ నాయకులతో బలమైన పరిచయాలు ఉండటంతో కొందరు ఎంఈఓలు అంతాతామై వ్యవహరిస్తున్నారన్న ఆరోణలున్నాయి. డీఈఓలతో సైతం లెక్కలేనితనంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు మూటగట్టుకుంటున్నారు. కొందరు ఎంఈఓల వైఖరి చూసిన ఉపాధ్యాయ సంఘాల నాయకులు, సామాన్య టీచర్లు, స్కూళ్ల కరస్పాండెంట్లు ఎప్పుడు వీళ్లను బదిలీ చేస్తారా అంటూ అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఎంఈఓల బదిలీలపై వివరణ కోసం ఆర్‌జేడీ శామ్యూల్‌ను ఆదివారం ఫోన్‌లో సంప్రదించగా...ఆయన అందుబాటులోకి రాలేదు.

మండలం	ఎంఈఓ పేరు	ఏ రోజు నుంచి	రెగ్యులర్ లేదా ఎఫ్ఏసీ	ఎన్నేళ్లుగా పనిచేస్తున్నారు
అనంతపురం	వెంకటస్వామి	07-07-2012	రెగ్యులర్	12 ఏళ్లకు పైగా
ఆత్మకూరు	నరసింహారెడ్డి	27-03-2017	రెగ్యులర్	7 ఏళ్లకుపైగా
బెళుగుప్ప	మల్లారెడ్డి	03-07-2023	రెగ్యులర్	ఏడాదికిపైగా
బొమ్మనహాళ్	వీరన్న	15-07-2023	ఎఫ్ఏసీ	ఏడాదికిపైగా
బ్రహ్మసముద్రం	ఓబుళపతి	27-03-2017	ఎఫ్ఏసీ	7 ఏళ్లకు పైగా (06.08.2022నుంచి కుందుర్పి మండలం ఎఫ్ఏసీ కూడా)
బుక్కరాయసముద్రం	నవీద	16.5.2024	ఎఫ్ఏసీ	3నెలలకుపైగా
కణేకల్లు	లక్ష్మన్న	03-07-2023	రెగ్యులర్	ఏడాదికిపైగా (21.7.2023 నుంచి డీ.హీరేహాళ్ మండలం ఎఫ్ఏసీ కూడా)
గార్లదిన్నె	తారాచంద్రానాయక్	27.03.2017	రెగ్యులర్	7ఏళ్లకుపైగా
గుత్తి	రవినాయక్	27.03.2017	రెగ్యులర్	7ఏళ్లకుపైగా
రాయదుర్గం	నాగమణి	27.03.2017	రెగ్యులర్	7ఏళ్లకుపైగా (15.2.2023 నుంచి గుమ్మఘట్ట మండలం ఎఫ్ఏసీ కూడా)
గుంతకల్లు	మస్తాన్‌రావు	03.07.2023	రెగ్యులర్	ఏడాదికిపైగా
కళ్యాణదుర్గం	విజయకుమారి	27.03.2017	రెగ్యులర్	7 ఏళ్లకు పైగా (18.07.2023కంబదూరు మండలం ఎఫ్ఏసీ కూడా)
కూడేరు	చంద్రశేఖర్	27.03.2017	రెగ్యులర్	7 ఏళ్లకు పైగా
నార్పల	క్రిష్టయ్య	07.07.2012	రెగ్యులర్	12 ఏళ్లకుపైగా
పామిడి	జయనాయక్	27.03.2012	రెగ్యులర్	12 ఏళ్లకుపైగా
పెద్దపప్పూరు	హెచ్.శ్రీదేవి	03.07.2023	రెగ్యులర్	ఏడాదికిపైగా
పెద్దవడుగూరు	రాముడు	27.03.2017	రెగ్యులర్	7 ఏళ్లకుపైగా
పుట్లూరు	పి.శ్రీదేవి	27.03.2017	రెగ్యులర్	7 ఏళ్లకుపైగా (ప్రస్తుతం గుత్తి డిప్యూటీ డీఈఓ కూడా)
రాప్తాడు	మల్లికార్జున	27.11.2014	రెగ్యులర్	9 ఏళ్లకు పైగా
శెట్టూరు	శ్రీధర్	27.03.2017	రెగ్యులర్	7 ఏళ్లకుపైగా
శింగనమల	నరసింహరాజు	27.03.2017	రెగ్యులర్	7 ఏళ్లకుపైగా
తాడిపత్రి	నాగరాజు	27.03.2017	రెగ్యులర్	7 ఏళ్లకుపైగా
ఉరవకొండ	ఈశ్వరప్ప	27.03.2017	రెగ్యులర్	7 ఏళ్లకుపైగా
వజ్రకరూరు	ఎర్రిస్వామి	27.03.2017	రెగ్యులర్	7 ఏళ్లకుపైగా
విడపనకల్లు	శ్రీనివాసరావు	03.07.2023	రెగ్యులర్	ఏడాదికిపైగా (ప్రస్తుతం అనంతపురం డిప్యూటీ డీఈఓ కూడా)
యాడికి	కేశప్ప	27.03.2017	రెగ్యులర్	7 ఏళ్లకుపైగా
యల్లనూరు	ఎల్.పి.చంద్రశేఖర్	27.03.2017	రెగ్యులర్	7 ఏళ్లకుపైగా

వీరాంజనేయులుకు ఘన నివాళి


వీరాంజనేయులుకు నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే కాలవ, నాయకులు

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 1: టీడీపీ సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు వీరాంజనేయులుకు పలువురు ఎమ్మెల్యేలు, టీడీపీ నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు. స్థానిక జీఆర్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం వీరాంజనేయులు సంస్మరణ సభ నిర్వహించారు. ఎమ్మెల్యేలు కాలవ శ్రీనివాసులు, ఎంఎస్ రాజు, జాతీయ ప్రధాన కార్యదర్శి వైకుంఠం ప్రభాకర్ చౌదరి, జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి, మాజీ మేయర్ స్వరూప, డీసీఎంఎస్ మాజీ ఛైర్మన్ జయచంద్రనాయుడు తదితరులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీకి వీరాంజనేయులు చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. రాష్ట్ర నాయకులు తలారి ఆదినారాయణ, ఆలం నరసానాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి, రామలింగారెడ్డి, రాయల్ మురళీ, దేవళ్ల మురళీ, సరిపూటి రమణ, లక్ష్మీనరసింహ, వెంకటప్ప, సింగవరం రవి, గోనుగుంట్ల విజయ కుమార్, డాక్టర్లు ప్రదీప్ చౌదరి, రోహిత్‌రెడ్డి, రామమోహన్ పాల్గొన్నారు.

గుంతకల్లు డివిజన్ మీదుగా రైళ్ల మళ్లింపు

గుంతకల్లు, సెప్టెంబరు 1: వర్షాల కారణంగా పలు రైళ్లను గుంతకల్లు రైల్వే డివిజన్ మీదుగా మళ్లించినట్లు రైల్వే అధికారులు ఆదివారం తెలిపారు. వరంగల్లు మీదుగా వెళ్లే బెంగళూరు-పాట్నా వెళ్లే ఎక్స్‌ప్రెస్ (నెం. 22354)ను 1వ తేదీన ధర్మవరం, గుంతకల్లు, సులేహళ్లి, సికింద్రాబాద్, ఖాజీ పేట్ మీదుగా మళ్లించినట్లు తెలియజేశారు. అదేవిధంగా ఖమ్మం మీదుగా వెళ్లే యశ్వంతపూర్-టాటానగర్ ఎక్స్‌ప్రెస్ (నెం. 18112) రైలును 1వ తేదీన బళ్లారి-గుంతకల్లు-గుత్తి-నంద్యాల-గుంటూరు-విజయవాడ మీదుగా మళ్లించామన్నారు. సికింద్రాబాదు-తిరుపతి ఎక్స్‌ప్రెస్ (నెం. 12764) రైలును 1వ తేదీన జన్‌గావ్-శ్రీకాళహస్తి రూటులో కాకుండా సికింద్రాబాద్, గుంతకల్లు, కడప, రేణిగుంట మీదుగా తిప్పి పంపినట్లు వివరించారు. 1వ తేదీన విజయవాడ-వరంగల్లు మీదుగా వెళ్లే తిరునవేలి-బిలాస్‌పూర్ ఎక్స్‌ప్రెస్ (నెం. 22620)ను రేణిగుంట-గుత్తి-డోన్-కాచిగూడ ఖాజీపేట్ మీదుగా, వరంగల్లు మీదుగా వెళ్లే కోచివేలి-గోరఖపూర్ ఎక్స్‌ప్రెస్ (నెం. 12512)ను కాట్పాడి, రేణిగుంట, గుత్తి, డోన్, కాచిగూడ, ఖాజీపేట్ మీదుగా, ఖమ్మం మీదుగా వెళ్లే త్రివేండ్రం-న్యూఢిల్లీ ఎక్స్‌ప్రెస్ (నెం. 12526)ను రేణిగుంట, గుంతకల్లు, సులేహళ్లి, సికింద్రాబాద్, ఖాజీపేట్ మీదుగా మళ్లించడం జరిగిందన్నారు. రామేశ్వరం-అయోధ్య వెళ్లే ఎక్స్‌ప్రెస్ (నెం. 22613)ను కాట్పాడి, రేణిగుంట, గుత్తి, డోన్, కాచిగూడ, ఖాజీపేట్ మీదుగా, గయ-చెన్నై వెళ్లే ఎక్స్‌ప్రెస్ (నెం. 12389) రైలును బాలార్షా, ఖాజీపేట్, సికింద్రాబాద్, సులేహళ్లి, గుంతకల్లు, విజయవాడ మీదుగా మళ్లించామన్నారు. అదేవిధంగా ఈ 2వ తేదీన అరక్కోణం-వరంగల్లు మీదుగా వెళ్లాల్సిన మధురై-చండీఘర్ ఎక్స్‌ప్రెస్ (నెం.12687)ను రేణిగుంట, గుంతకల్లు, సూలేహళ్లి, సికింద్రాబాద్, ఖాజీపేట్ మీదుగా, దానాపూర్-బెంగళూరు వెళ్లే సంఘమిత్ర ఎక్స్‌ప్రెస్ (నెం. 12295)ను ధర్మవరం, గుంతకల్లు, సులేహళ్లి, సికింద్రాబాద్, ఖాజీపేట్ మీదుగా మళ్లించనున్నట్లు తెలిపారు.

పీఏబీఆర్‌లోకి హంద్రీనీవా నీరు

కూడేరు, సెప్టెంబరు 1: పెన్నహోబిళం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లోకి జీడిపల్లి రిజర్వాయర్‌ను నుంచి హంద్రీ నీవా నీరు వస్తోంది. మూడు రోజులుగా జీడిపల్లి రిజర్వాయర్ నుంచి 99 క్యూసెక్కుల నీరు పీఏబీఆర్‌లోకి వస్తోందని ఇరిగేషన్ ఏఈ లక్ష్మీదేవి ఆదివారం తెలిపారు. తుంగభద్ర డ్యాం నుంచి 459 క్యూసెక్కులతోపాటు జీడిపల్లి నుంచి 99 క్యూసెక్కుల నీరు వస్తుండటంతో పీఏబీఆర్‌లో 1.657 టీఎంసీల నీరు నిల్వ ఉందని ఏఈ పేర్కొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

కొత్తచెరువు, సెప్టెంబరు 1: సమగ్రశిక్షణ కార్యాలయంలో ఖాళీగా ఉన్న సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారిణి మీనాక్షి ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఈనెల 7వతేదీ సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తులు, విద్యార్హతపత్రాలను బుక్కపట్నంలోని సమగ్రశిక్షణ కార్యాలయంలో అందజేయాలన్నారు.

ఖాళీల వివరాలు: ఇన్‌క్లూజ్ ఎడ్యుకేషన్ కో ఆర్డినేటర్, ఆల్టర్‌నేటివ్ స్కూల్ కో ఆర్డినేటర్, ప్లానింగ్ అండ్ మిస్ కో ఆర్డినేటర్, కమ్యూనిటీ మొబలైజేషన్ ఆఫీసర్, అసి అకాడమిక్ మానటరింగ్ కో ఆర్డినేటర్ (జనరల్), ఆసీ బాలికా శిశు అభివృద్ధి అధికారి (మహిళా టీచర్ మాత్రమే), అసిస్ట ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ కో ఆర్డినేటర్, అసిస్టెంట్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్ ఒక్కొక్క పోస్టు ఖాళీలు ఉన్నాయి. అసిస్టెంట్ స్టాటికల్ ఆఫీసర్ రెండు పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు.

సజావుగా యూపీఎస్సీ పరీక్షలు

అనంతపురం టౌన్, సెప్టెంబరు 1: యూపీఎస్సీ పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. జిల్లాకేంద్రంలోని జేఎన్‌టీయూ కాలేజ్ ఇంజనీరింగ్ ప్రధాన భవనంలో కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ ఎగ్జామినేషన్ రెండు కేంద్రాల్లో, కేఎస్ఎన్ డిగ్రీ మహిళా డిగ్రీ కళాశాలలో నేషనల్ డిఫెన్స్ అండ్ నావల్ అకాడమీ ఎగ్జామినేషన్ రెండు కేంద్రాల్లో నిర్వహించారు. ఎక్కడా ఎటువంటి పొరపాటు జరగకుండా పకడ్బందీగా పరీక్షలు జరిగేలా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రాలను ఆయన పరిశీలించారు.

దులీప్ ట్రోఫీ నిర్వహణపై ప్రత్యేక దృష్టి


సూచనలు, సలహాలు ఇస్తున్న ఎస్పీ జగదీష్


మైదానాన్ని పరిశీలిస్తున్న బీసీసీఐ ప్రతినిధులు

ఆటగాళ్ల భద్రతకు ప్రాధాన్యం: ఎస్పీ జగదీష్

ఏసీజీ, బసచేసే ప్రాంతాల పరిశీలన

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 1: దులీప్‌ట్రోఫీ నిర్వహణపై ప్రత్యేకదృష్టి సారించామని, ఆటగాళ్ల భద్రతకు ప్రాధాన్యత ఇస్తామని అనంతపురం జిల్లా ఎస్పీ జగదీష్ తెలిపారు. ఈనెల 5వ తేదీ నుంచి 22వ తేదీ వరకు అనంతపురం క్రికెట్ గ్రౌండ్, ఆటగాళ్లు బస చేసే మాసినేని, అలెగ్జాండర్ హోటళ్లను ఆదివారం ఎస్పీ జగదీష్ పరిశీలించారు. ఏసీజీ, బసచేసే హోటళ్ల వద్ద తీసుకోవాల్సిన భద్రతా చర్యలపై పోలీసులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆటగాళ్లు ఏసీజీకి వెళ్లే రూట్లపై ఆరాతీశారు. డ్రెస్సింగ్ రూంలు, పార్కింగ్ ప్రదేశాలు, ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లు, గ్యాలరీలు, ఏఎస్‌వీలో ఆయా ప్రాంతాలను నిశితంగా పరిశీలించారు. ఎటువంటి ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా వాహనాల రాకపోకలకు సరైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. 300 మందికిపైగా పోలీసులతో బందోబస్త్ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రూరల్ డీఎస్పీ శివారెడ్డి, ఏఆర్ డీఎస్పీ మునిరాజ్, సీఐలు రాజేంద్రనాథ్ యాదవ్, శ్రీకాంత్, శ్రీహర్ష, ఆర్ఐ రాముడు, ఎస్ఐ రామకృష్ణ పాల్గొన్నారు.

ఏసీజీని పరిశీలించిన బీసీసీఐ ప్రతినిధులు

బీసీసీఐ ప్రతినిధులు ఆదివారం అనంతపురం క్రికెట్ గ్రౌండ్‌ను పరిశీలించారు. వర్షం పడుతుండడంతో పిచ్ పరిస్థితి, ఆటపై పడే ప్రభావాన్ని అంచనా వేశారు. బీసీసీఐ ఆపరేషన్ మేనేజర్ అమిత్ సిద్దేశర్, క్యూరేటర్ సమందర్‌సింగ్ పిచ్‌ను, ప్రాక్టీస్ చేయడానికి నెట్‌లను పరిశీలించారు. అటు బౌలింగ్, బ్యాటింగ్, ఫీల్డింగ్, కీపింగ్ అంశాలకు సంబంధించి పిచ్ ఏవిధంగా ప్రభావం చూపుతుందో చర్చించారు. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ జనరల్ మేనేజర్ రోహిత్‌వర్మ, అసిస్టెంట్ మేనేజర్ ఆదిత్యవర్మ, మీడియా మేనేజర్ రాజగోపాల్, దులీప్‌ట్రోఫీ ఆర్గనైజింగ్ కమిటీ సెక్రటరీ షాబుద్దీన్, సభ్యులు ఆర్డీటీ స్పోర్ట్స్ డైరెక్టర్ సాయికృష్ణ, కోచ్ యుగంధర్‌రెడ్డి తదితరులు ట్రోఫీ నిర్వహణ చర్యల్లో పాల్గొన్నారు.

ప్రతి పనికీ.. ఓ రేటు

ఏ పని జరగాలన్నా డబ్బులివ్వాల్సిందే..

పనిని బట్టి రేటు నిర్ణయించి వసూలు చేస్తున్న ఓ అధికారి

ఇదీ కళ్యాణదుర్గం తహసీల్దార్ కార్యాలయంలోని దుస్థితి

కళ్యాణదుర్గం, సెప్టెంబరు 1: ఆ తహసీల్దార్ కార్యాలయంలో ప్రతి పనికి ఓ రేటు ఉంది. ముఖ్యంగా ఓ అధికారి పనిని బట్టి రేటు నిర్ణయించి దర్జాగా వసూలు చేస్తున్నాడు. ఆ అధికారి అడిగినంత ఇవ్వకపోతే పనులు ఏ మాత్రం ముందుకు సాగవు. దీంతో పనులు జరగాలంటే ఆ అధికారి చెప్పినట్లుగానే డబ్బులు ముట్టజెప్పాల్సిందే. ఈ దుస్థితి కళ్యాణదుర్గం తహసీల్దార్ కార్యాలయంలో నెలకొంది. ఆ అధికారి అవినీతి గురించి కార్యాలయ సిబ్బందే బహిరంగంగా విమర్శిస్తున్నారు. దీన్నిబట్టి చూస్తుంటే ఆ అధికారి అవినీతి ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ఆయన గత వైసీపీ ప్రభుత్వంలో ఆ పార్టీ నాయకులతో కుమ్మక్కై ఇష్టానుసారంగా అక్రమాలకు ఆజ్యం పోశాడు. అన్ని అర్హతలు ఉన్నా.. పట్టాదారు పాసుపుస్తకం ఇవ్వడానికి సవాలక్ష అంక్షలు విధిస్తాడు. అదే డబ్బు ఇస్తామని ఎవరైనా ముందుకొస్తే.. క్షణాల్లోనే పట్టాదారుపాసుపుస్తకాల మంజూరుకు అనుమతులు లభిస్తాయి. గత ఐదేళ్ల నుంచి పనిచేస్తున్న ఆ అధికారి అవినీతి అంతా ఇంతా కాదని ప్రజలు బహిరంగంగా చర్చించుకుంటున్నారు. చివరికి ఎన్‌ఓసీ సర్టిఫికెట్ మంజూరు చేయడానికి రూ. 10 లక్షల దాకా వసూళ్లకు పాల్పడినట్లు తెలిసింది. ఆ కార్యాలయంలో ఆ అధికారే కీలకం. రెవెన్యూ పనులు చక్కదిద్దడంలోనూ సిద్ధహస్తుడు. కార్యాలయంలో అక్రమమైనా, సక్రమమైనా ఆ అధికారి వద్దకు వెళ్లాల్సిందే. ఉన్నతాధికారులకు ఆ అధికారి చెప్పిందే వేదమనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రాత్రి 7 నుంచి 8 గంటల సమయంలో డిజిటల్ కీ ద్వారా అన్ని పనులు చక్కదిద్దుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఆ అధికారి అవినీతి ఎక్కువైపోవడంతో ఇక ఒత్తిళ్లు, వేధింపులు ప్రారంభమవుతాయని గ్రహించి బదిలీ ప్రయత్నాల్లో ముమ్మరంగా ఉన్నట్లు తెలిసింది. కొద్దిరోజుల క్రితం తహసీల్దార్ కార్యాలయం సమీపంలో ఏసీబీ అధికారులు సంచరించినట్లు తెలిసింది. దీంతో ఏసీబీ అధికారులు వస్తున్నారన్న సమాచారంతో ఆ అవినీతి అధికారితో పాటు తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది పత్తాలేకుండా పోయారని సమాచారం. ఇప్పటికే అవినీతి అధికారిపై ఏసీబీ అధికారులకు కూడా బాధితులు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఆ అధికారి లక్షలాది రూపాయలు ఆర్జించినట్లు విశ్వసనీయ సమాచారం. ఏదిఏమైనా ఉన్నతాధికారులు స్పందించి ఆ అవినీతి అధికారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

చంద్రగిరిలో ధర్మవరం వ్యాపారి ఆందోళన

రూ.50 లక్షల పట్టుచీరలు తీసుకుని మోసగించిన మహిళ

ఆమె ఇంటి వద్ద బైఠాయించిన బాధితుడు


మాట్లాడుతున్న సాయికుమార్

ధర్మవరం, సెప్టెంబరు 1: తిరుపతి జిల్లా చంద్రగిరికి చెందిన కందుకూరి గాయత్రి అనే మహిళ రూ.50 లక్షల పట్టు చీరలను కొనుగోలు చేసి మోసగించిందని శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణానికి చెందిన చేనేత వ్యాపారి ముత్తురెడ్డి సాయికుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. నెలల తరబడి సొమ్ము చెల్లించకపోవడంతో తాను చంద్రగిరికి వచ్చానని, నాలుగు రోజులుగా ఆమె ఇంటి చుట్టూ తిరుగుతున్నా స్పందించడం లేదని వాపోయాడు. చంద్రగిరి నుంచి ఆంధ్రజ్యోతికి ఆయన ఆదివారం ఫోన్ చేశారు. రెండేళ్ల నుంచి ఆమె తన వద్ద పట్టుచీరలను కొనుగోలు చేస్తోందని, నమ్మకం కలిగి చీరలను అప్పుగా ఇచ్చానని తెలిపారు. ఆ తరువాత ఎన్నాళ్లయినా ఆమె రాకపోవడంతో అనుమానం వచ్చి చంద్రగిరికి వచ్చానని తెలిపారు. డబ్బులు ఇవ్వకుండా మొండికి వేయడంతో ఆమెపై తిరుపతి గ్రీవెన్స్‌లో పోలీసులకు ఫిర్యాదు చేశానని తెలిపారు. డబ్బుల కోసం గాయత్రి ఇంటి వద్ద ఆదివారం బైఠాయించానని, దీంతో ఆమె డయల్ 100కు ఫోన్ చేసి పోలీసుల ద్వారా అడ్డుకుంటోందని తెలిపారు. ఆమె ఇంటి వద్ద బైఠాయించవద్దని, ఏదైనా ఉంటే తన సొంత ప్రాంతంలో పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఇక్కడి పోలీసులు అంటున్నారని వాపోయాడు. ధర్మవరంలో తనతోపాటు 15 మంది పట్టు చీరల వ్యాపారులను ఇదే తరహాలో మోసం చేసిందని, తమిళనాడులో వ్యాపారులకు రూ.20 కోట్లు ఎగవేసినట్లు అక్కడి పత్రికల్లో కథనాలు వచ్చాయని అన్నారు. తనకు న్యాయం చేయాలని ఆయన పోలీసులకు విన్నవించారు.

అంబేడ్కర్ వాదానికి అక్షరరూపం.. మద్దూరి సాహిత్యం

పుస్తకావిష్కరణలో వక్తలు

అనంతపురం కల్చరల్, సెప్టెంబరు 1: అంబేడ్కర్ వాదానికి అక్షరరూపం మద్దూరి నగేష్‌బాబు సాహిత్యమని విశ్లేషకుడు డాక్టర్ ఖాజా అన్నారు. జెన్నె వైష్ణవి సాహిత్య వేదిక ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఎన్జీఓ హోంలో 'మద్దూరి నగేష్‌బాబు సమగ్ర సాహిత్యం' పుస్తక ఆవిష్కరణ సభ జరిగింది. సభకు డాక్టర్ ఖాజాతోపాటు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత బండి నారాయణస్వామి, డాక్టర్ కోయి కోటేశ్వరరావు, యోగి వేమన యూనివర్సిటీ ప్రొఫెసర్ ఎంఎం వినోది హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళిత సాహితీ ఉద్యమానికి బీజం వేసిన వారిలో మద్దూరి నగేష్‌బాబు మొదటివాడన్నారు. అన్ని రూపాలలో దళితులపై అణచివేత ఏళ్లకు ఏళ్లు కొనసాగిందని, మద్దూరు నగేష్‌బాబు వంటివారు అంబేడ్కర్ సాహిత్య ప్రభావంతో దళితుల్లో గొప్ప స్ఫూర్తి రగిలించారన్నారు. జెన్నె వైష్ణవి సాహిత్య వేదిక వ్యవస్థాపకుడు డాక్టర్ జెన్నె ఆనంద్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో సాహితీవేత్తలు డాక్టర్ అంకె శ్రీనివాస్, అప్పిరెడ్డి హరినాథరెడ్డి, కొత్తపల్లి సురేష్, కంబదూరి షేక్ నబిరసూల్, గోసల నారాయణస్వామి, కోటిగారి వన్నప్ప, మిద్దె మురళీకృష్ణ, మధురశ్రీ, టీపీ రెండి, చం.శాస్త్రి, తూముచర్ల రాజారాం పాల్గొన్నారు.


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు

రేపు జాబ్‌మేళా

నార్పల, సెప్టెంబరు 1: ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్, సీడప్, డీఆర్‌డీఏ సంయుక్తంగా మంగళవారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు నైపుణ్యాభివృద్ధి అధికారి ఆనంద్ రాజ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జాబ్‌మేళాలో అమర్‌రాజా, టాటా విస్ట్రాన్, డిక్సాన్, బర్గిన్‌ఫైప్ కంపెనీలు పాల్గొంటాయన్నారు. పదవ తరగతి, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ పాస్, ఫెయిల్ అయిన 18 నుంచి 35 సంవత్సరాల వయస్సు వారు హాజరుకావచ్చన్నారు. జాబ్‌మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్ 9010039901 నెంబర్‌కు సంప్రదించాలన్నారు.

'పొలం పిలుస్తోంది' వాయిదా

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 1: భారీ వర్షాల నేపథ్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ప్రభుత్వం వాయిదా వేసినట్లు జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 10వతేదీ నుంచి పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మొదలు పెట్టాలని రాష్ట్ర ఉన్నతాధికారులు ఆదేశించారన్నారు. అప్పటి నుంచి ప్రతి మంగళ, బుధవారాల్లో అన్ని మండలాల్లో కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. వ్యవసాయ అధికారితోపాటు అనుబంధ శాఖల అధికారులు, శాస్త్రవేత్తలు బృందాలుగా ఏర్పడి కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు.

సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఆత్మహత్య


అశోక్ (ఫైల్)

ఉరవకొండ, సెప్టెంబరు 1: వజ్రకరూరు మండలంలోని కొనకొండ్ల గ్రామంలో ఆర్థిక ఇబ్బందులతో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అశోక్ (26) ఉరివేసుకుని ఆదివారం ఆత్మహత్య చేసుకున్నాడు. కృష్ణమూర్తి, లక్ష్మీదేవి దంపతుల కుమారుడు అశోక్. చెన్నైలోని ఓ కంపెనీలో ఉద్యోగం చేస్తూ నాలుగేళ్ల నుంచి తండ్రితోపాటు వ్యవసాయం చేస్తున్నాడు. గత ఏడాది మిర్చి పంటను సాగు చేశాడు. వ్యవసాయం, చెల్లెలి పెళ్లి కోసం రూ. 12 లక్షల దాకా అప్పు చేశాడు. రెండు నెలల నుంచి ఇంటి వద్ద ఉంటూ వేరే కంపెనీలో ఉద్యోగం కోసం ప్రయత్నాలు మొదలు పెట్టాడు. చేసిన అప్పులు తీర్చే మార్గం లేక తీవ్ర మనోవేదనకు గురై ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య పాల్పడ్డాడు. గమనించిన బంధువులు గుంతకల్లు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

ప్రాణాలు తీసిన రీల్స్

సెల్ఫీ తీసుకుంటూ నీట మునిగి యువకుడి మృతి


మహమ్మద్ కైఫ్(ఫైల్)

చిలమత్తూరు, సెప్టెంబరు 1: సోషల్ మీడియా రీల్స్ చేస్తూ ప్రమాదవశాత్తు నీటిలో మునిగి యువకుడు మృతిచెందినట్లు ఎస్ఐ మున్నీర్ అహమ్మద్ తెలిపారు. హిందూపురం పట్టణంలోని బాలాజీనగర్‌కి చెందిన రియాజ్‌వుల్లా కుమారుడు మహమ్మద్ కైఫ్ (22) కుటుంబ సభ్యులతో శనివారం దేమకేతేపల్లి సమీపంలోని శ్రీధర్‌గుట్టలోని క్వారీ వద్దకు వెళ్లాడు. మహమ్మద్ కైఫ్ అక్కడున్న నీటిమడుగు చూసి అందులో దిగి సెల్ఫీతో రీల్స్ చేయడానికి ప్రయత్నించాడు. ప్రమాదవశాత్తు నీటిమడుగులో పడిపోయాడు. ఈత రాకపోవడంతో బయటకు రాలేకపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు కాపాడే ప్రయత్నం చేశారు. వారికీ ఈత రాకపోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. వారు వచ్చేసరికి అతడు పూర్తిగా నీటిలో మునిగిపోయాడు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది తీవ్రంగా గాలించారు. అయినా అతడి మృతదేహం లభ్యంకాలేదు. చీకటిపడటంతో ఆదివారం ఉదయం మరోమారు వారు ప్రయత్నించి మృతదేహాన్ని నీటి నుంచి బయటకు తీసుకువచ్చారు. కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సంగీతం, సాహిత్యం మూర్తీభవించిన వ్యక్తి నారాయణాచార్యులు



నారాయణాచార్యులు చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న సాహితీకారులు

అనంతపురం కల్చరల్, సెప్టెంబరు 1: సంగీతం, సాహిత్యం మూర్తీభవించిన వ్యక్తి పుట్టపర్తి నారాయణాచార్యులు అని పలువురు వక్తలు కొనియాడారు. పద్మశ్రీ పురస్కార గ్రహీత పుట్టపర్తి నారాయణాచార్యులు వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం స్థానిక లలితకళాపరిషత్‌లో వివిధ సాహితీ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో పుట్టపర్తి నారాయణాచార్యులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పరిషత్ అధ్యక్షుడు వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ నారాయణాచార్యులు చిన్నవయసులోనే భారతం, భాగవతం, పురాణాలతోపాటు సంగీతం అవపోసన చేసిన గొప్ప వ్యక్తి అని పేర్కొన్నారు. ఎస్కేయూ తెలుగు శాఖ అకడమిక్ కన్సల్టెంట్ డాక్టర్ నానీల నాగేంద్ర, తెలుగు వెలుగు సాహిత్య సామాజిక సేవా సంస్థ అధ్యక్షుడు టీవీ రెడ్డి మాట్లాడుతూ నారాయణాచార్యులు శివతాండవం, అగ్నివీణ, మేఘదూతం, జనప్రియ రామాయణం, పండరీ భాగవతం వంటి కావ్యాలు రచించి తెలుగు సాహితీలోకంలో అగ్రస్థానంలో నిలిచారన్నారు. అనంత సాహితీ ప్రస్థానం ట్రస్టు వ్యవస్థాపకుడు గంగిరెడ్డి అశ్వత్థరెడ్డి, ఉమర్ అలీషా సాహిత్యపీఠం కార్యదర్శి షేక్ రియాజుద్దీన్, ద్విభాషా కవి డాక్టర్ జూటూరు షరీఫ్, సాంబశివుడు, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

జిల్లా జట్ల ఎంపిక

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 1: టెన్నీకాయిట్ సబ్‌జూనియర్ బాల, బాలికల జిల్లా జట్లు ఎంపిక చేశారు. ఆదివారం కళ్యాణదుర్గంలో నిర్వహించిన ఎంపిక పోటీల్లో జిల్లా జట్లను ఎంపిక చేసినట్లు జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రజాక్, రంగస్వామిలు తెలిపారు. ఎంపికైన సబ్‌జూనియర్ బాలుర జట్టులో మహిధర్, లతీఫ్, చనిత్‌రాజ్, బాబామహబూబ్ ఉన్నారు. బాలికల జట్టులో జ్యోతిక, స్పందన, పూజ ఉన్నారు. ఎంపికైన జట్లు 16వ తేదీన శ్రీకాకుళంలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు ప్రాతినిథ్యం వహిస్తారని తెలిపారు. పీడీలు అమరాంజనేయులు, షన్ముఖ, శ్రీనివాసులు, రమేష్ పాల్గొన్నారు.

లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



మైనార్టీ కాలనీ ప్రజలతో మాట్లాడుతున్న అధికారులు

రాప్తాడు, సెప్టెంబరు 1: భారీ వర్షాల నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జడ్పీ సీఈఓ ఓబులమ్మ సూచించారు. ముంపునకు గురి కాకుండా ముందస్తు జాగ్రత్తలు చేపడుతున్నట్లు ఆమె తెలిపారు. రాప్తాడు గ్రామ పంచాయతీ మైనార్టీ కాలనీలో ఆదివారం అధికారులు పర్యటించి లోతట్టు ప్రాంతాలను పరిశీలించారు. ప్రధాన కాలువల్లో నీరు వేగంగా వెళ్లేందుకు ఎక్స్‌కవేటర్‌తో పూడికతీత పనులు చేయించారు. వర్షపు నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపడుతున్నామన్నారు. భారీ వర్షాలు కురిసినప్పుడు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డీపీఓ ప్రభాకర్‌రావు, ఎంపీడీఓ సాల్మన్‌రాజ్, సర్పంచ్ సాకే తిరుపాలు పాల్గొన్నారు.

నేటి నుంచి విద్యావైజ్ఞానిక తరగతులు



మాట్లాడుతున్న పీడీఎస్‌యూ నాయకులు

అనంతపురం సెంట్రల్, సెప్టెంబరు 1: పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో సోమవారం నుంచి విద్యావైజ్ఞానిక తరగతులు నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వీరేంద్ర ప్రసాద్ తెలిపారు. ఆదివారం రోడ్లు, భవనాల అతిథిగృహంలో మీడియా సమావేశాన్ని ఏర్పాటుచేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కర్ మాట్లాడుతూ మేధావులు, విద్యావేత్తలు, శాస్త్రవేత్తలు, పారిశ్రామిక వేత్తలు, రాజకీయ నాయకులు విద్యాసంస్థలు చెక్కిన శిల్పాలన్నారు. అయితే సమాజహితాన్ని మరచిపోయి కార్పొరేట్ శక్తుల బానిసలుగా తయారవుతున్నారని పేర్కొన్నారు. ఇలాంటి రుగ్మతులకు భవిష్యత్తులో నేటి విద్యార్థులు లోనుకాకుండా విద్యావైజ్ఞానిక తగరతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నాయకులు శంకర్, తేజ, నరేష్, రాఘవేంద్ర, అభి, అంజనేయలు పాల్గొన్నారు.

విద్యుత్ పరికరాల చోరీ

గార్లదిన్నె, సెప్టెంబరు 1: మండలంలోని గార్లదిన్నె, బూదేడు గ్రామాలలో ఉన్న వ్యవసాయ తోటల్లో విద్యుత్ పరికరాలు చోరీకి గురయ్యాయి. బూదేడు గ్రామానికి చెందిన రామాంజనేయులు, గార్లదిన్నెకు చెందిన రైతు నల్లప్ప వ్యవసాయ తోటల్లో బోర్లకు అమర్చిన విద్యుత్ స్టార్టర్ పెట్టెలను శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. ఆదివారం ఉదయం రైతులు తోటల వద్దకు వెళ్లిచూడగా పరికరాలు చోరీకి గురైనట్లు గుర్తించారు. బాధితులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దుండగుల కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు ఎస్ఐ గౌస్‌బాషా తెలిపారు.

వన్‌టౌన్ సీఐ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు చేపట్టిన రాజేంద్రనాథ్‌యాదవ్

అనంతపురం క్రైం, సెప్టెంబరు 1: నగర వన్‌టౌన్ సీఐగా ఆదివారం రాజేంద్రనాథ్‌యాదవ్ బాధ్యతలు చేపట్టారు. ఇదివరకు సీఐగా పనిచేస్తున్న రెడ్డప్పను ధర్మవరం సీఐగా బదిలీ చేయడంతో ఆయన ఇప్పటికే రిలీవ్ అయ్యారు. నల్లమాడ సీఐగా విధులు నిర్వర్తిస్తున్న రాజేంద్రనాథ్‌యాదవ్‌ను కళ్యాణదుర్గం రూరల్ సీఐగా బదిలీ చేశారు. ఆ బదిలీని క్యాన్సిల్ చేస్తూ వన్‌టౌన్ సీఐగా నియమించారు. బాధ్యతలు చేపట్టిన సీఐకి సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి



మాట్లాడుతున్న ఎస్ఐ మహమ్మద్‌గౌస్ బాషా

గార్లదిన్నె, సెప్టెంబరు 1: వినాయక చవితి పండుగను పురస్కరించుకుని వినాయకుని ప్రతిమలు ఏర్పాటు చేసేందుకు అనుమతులు తప్పని సరిగా పొందాలని ఎస్ఐ మహమ్మద్‌గౌస్ సూచించారు. ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎస్ఐ మాట్లాడారు. వినాయక ఉత్సవ కమిటీ వారు ముందుగా ఆన్‌లైన్‌లో గణేష్ ఉత్సవ్ వెబ్‌సైట్‌లోని ఫామ్‌ను పూర్తిచేసి సబ్‌మిట్ చేయాలన్నారు. అనంతరం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అనుమతులు పొందాలన్నారు. మరిన్ని వివరాలకు స్థానిక పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించాలని సూచించారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు: మండలంలోని శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పని ఎస్ఐ మహమ్మద్‌గౌస్‌బాషా హెచ్చరించారు. ఆదివారం సాయంత్రం మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న రౌడిషీటర్లకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకూడదని హెచ్చరించారు. అల్లర్లు సృష్టించి శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే సహించేది లేదన్నారు.

ఓపీఎస్‌ను అమలు చేయాలి

- ఉద్యోగ సంఘాల నిరసన



అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న ఏపీసీపీఎస్‌ఈఏ నాయకులు

అనంతపురం విద్య/టౌన్, సెప్టెంబరు 1: సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు చేయాలని ఏపీసీపీఎస్‌ఈఏ జిల్లా కార్యవర్గం ఆధ్వర్యంలో ఆ సంఘం నాయకులు ఆదివారం నిరసన తెలిపారు. సీపీఎస్ విద్రోహ దినాన్ని పురస్కరించుకుని పలు ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో పలు ప్రాంతాల్లో ఆందోళనలు చేపట్టారు. నగరంలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఏపీసీపీఎస్‌ఈఏ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, ప్రధాన కార్యదర్శి రామన్న మాట్లాడుతూ గత ప్రభుత్వం సీపీఎస్‌పై మోసం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. భాగ్యరాజ్, ఆది, చంద్రశేఖర్, గోపాలప్ప, గోపాల్ నాయక్, పవన్, రాజేష్, నారాయణస్వామి పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో..: ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో నగరంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. జిల్లా ప్రధానకార్యదర్శి సిరాజుద్దీన్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ శక్తులకు తలొగ్గి ఉద్యోగ, ఉపాధ్యాయ కార్మికుల సంక్షేమాన్ని పెడచెవిన పెడుతున్నాయంటూ మండిపడ్డారు. జిల్లా కార్యదర్శులు నరేష్‌సతీష్, ఇతర నాయకులు సర్దార్ వలి, వన్నప్ప, రంగనాయకులు, చిదంబరెడ్డి, శ్రీనివాసులు, సూర్యనారాయణ, పుల్లయ్య, హిమగిరి ప్రసాద్ పాల్గొన్నారు.

గాంధీ విగ్రహం వద్ద..: ఏపీటీఎఫ్ 1938 ఆధ్వర్యంలో గాంధీ విగ్రహం వద్ద ఆందోళన చేశారు. జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస నాయక్ మాట్లాడుతూ ప్రతి ఏటా సెప్టెంబర్ 1న నిర్వహించే సీపీఎస్ విద్రోహ దినానికి 20 ఏళ్లు పూర్తయ్యిందన్నారు. పాత పెన్షన్ విధానాన్ని వెంటనే పునరుద్ధరించాలన్నారు. రవీంద్ర, వెంకటసుబ్బయ్య, మహమ్మద్ రఫీ, శ్రీనివాసరెడ్డి, పీవీ ప్రసాద్, అశోక్ నాయక్, వజీర్, రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎస్టీయూ ఆధ్వర్యంలో: సీపీఎస్, జీపీఎస్ వంటివి వద్దు పాతపెన్షన్ విధానం(ఓపీఎస్) ఒక్కటే కావాలి అంటూ ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్న డిమాండ్‌తో రాష్ట్రకమిటీ ఇచ్చిన పిలుపు మేరకు ఆదివారం కలెక్టరేట్ వద్ద ఎస్టీయూ ఆందోళన చేపట్టింది. నాయకులు మాట్లాడుతూ కొత్తగా తీసుకొచ్చిన యూపీఎస్ వల్ల ఒరిగేదేమిలేదన్నారు. అవసానదశలో ఆసరాగా పింఛన్ ఇవ్వడాన్ని ప్రభుత్వాలు బాధ్యతగా భావించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు సూర్యుడు, గోవింద్‌నాయుడు, రాజశేఖర్, కృష్ణమోహన్, ఫణిభూషణ్, చంద్రశేఖర్, సురేష్, మురళి, కిరణ్ పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న ఎస్టీయూ నాయకులు, ఉద్యోగులు

సైద్ధాంతిక ఆలోచనలతోనే జేవీవీ అభివృద్ధి

- మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్



మాట్లాడుతున్న గేయానంద్

అనంతపురం కల్చరల్, సెప్టెంబరు 1: సైద్ధాంతిక పరమైన ఆలోచన, శాస్త్రీయ విజ్ఞానంతోనే జనవిజ్ఞాన వేదిక(జేవీవీ) అభివృద్ధి చెందుతోందని మాజీ ఎమ్మెల్సీ, జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గేయానంద్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఒకేషనల్ జూనియర్ కళాశాలలో నిర్వహించిన జేవీవీ జిల్లా వార్షిక మహాసభలో ఆయన మాట్లాడారు. ప్రచార సంబంధమైన కార్యక్రమాలు చేయడంద్వారా జేవీవీ అభివృద్ధి చెందినట్లు కాదని, ప్రజలను శాస్త్రీయ విజ్ఞానంవైపు మరల్చినపుడే నిజమైన అభివృద్ధి అన్నారు. దేశంలో జరుగుతున్న అభివృద్ధి వెనుక శాస్త్రీయ విజ్ఞానం, ఆలోచన దాగుందని, దీన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే విషయంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని అన్నారు. దీనివల్ల ప్రజల్లో అశాస్త్రీయ భావాలు ఇంకా నెలకొని ఉన్నాయన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లు గడుస్తున్నా మూఢాచారాలను అడ్డుకునే సరైన చట్టాలు లేకపోవడం వల్ల కొందరు తమకు తాము దైవాంశ సంభూతులుగా ప్రకటించుకుని, అమాయకులైన ప్రజల మానప్రాణాలతో చెలగాటమాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు మూఢాచారాలకు వ్యతిరేకంగా చట్టాలు తీసుకురావాలని డిమాండ్ చేశారు. జేవీవీ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వెంకటరామిరెడ్డి, లక్ష్మీనారాయణ, రాష్ట్ర నాయకులు రంగన్న, భాస్కర్, డాక్టర్ ప్రసూన, గాంగేనాయక్, వీర్రాజు, రామిరెడ్డి, చిత్తప్ప, జగదీష్ పాల్గొన్నారు.

పశువుల సంత ఆదాయం రూ.3.22 లక్షలు

అనంతపురంరూరల్, సెప్టెంబరు 1: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో జరిగిన పశువులసంతతో మార్కెట్‌కు రూ.3,22,210 ఆదాయం వచ్చినట్లు మార్కెట్ ఎంపికశ్రేణి కార్యదర్శి జయలక్ష్మి ఆదివారం తెలిపారు. శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంత ద్వారా మార్కెట్‌కు రూ.1,81,970, ఆదివారం జరిగిన ఎనుములు, ఎద్దులు, ఆవుల సంతతో రూ.1,40,240 వచ్చిందని తెలిపారు.

చదువే అన్ని సమస్యలకు పరిష్కారం



విద్యార్థికి చెక్కు అందజేస్తున్న శ్రీనివాసులు శెట్టి

అనంతపురం కల్చరల్, సెప్టెంబరు 1: చదువొక్కటే అన్ని సమస్యలకు పరిష్కారమని అవోపా ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు జయంతి శ్రీనివాసులుశెట్టి పేర్కొన్నారు. ఆదివారం సొసైటీ ఆధ్వర్యంలో ఆర్యవైశ్య హాస్టల్‌లో చదువుల్లో రాణిస్తున్న పేద ఆర్యవైశ్య విద్యార్థులకు జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు, నగదు పురస్కారాలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులందరూ బాగా చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని, నలుగురికీ సహాయ సహకారాలందించే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కిష్టయ్య, ఫణి భూషణం, నాగభూషణం, పార్శం నాగభూషణం, కమలాకర్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్యశిబిరం

శింగనమల, సెప్టెంబరు 1: మండల కేంద్రంలోని గర్భిణులకు మానస ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఆదివారం ఆస్పత్రి ఎండీ మానసా రెడ్డి మహిళలకు వైద్య చికిత్సలు చేశారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలి

- ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 1: భారీ వర్షాల నేపథ్యంలో నగరపాలిక సంస్థ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి, ప్రజలను అప్రమత్తం చేసి, ఎలాంటి ఇబ్బందులు పడకుండా చూడాలని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అనంతపురం అర్బన్ పరిధిలోని ప్రాంతాల్లో డ్రైనేజీలను శుభ్రంగా ఉంచాలన్నారు. వర్షం పడిన సమయంలో ఎలాంటి ఇబ్బంది లేకుండా నీరు ముందుకు వెళ్లేలా చర్యలు చేపట్టాలన్నారు. వర్షాల మూలంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా నగరపాలిక సంస్థ అధికారులు ఏర్పాటు చేసిన కంట్రోల్ రూంతోపాటు తన క్యాంపు ఆఫీస్ నంబర్లను సంప్రదించాలని కోరారు.

19 నుంచి ఏఐఎస్ఎఫ్ జిల్లా మహాసభలు

అనంతపురం విద్య, సెప్టెంబరు 1: జిల్లాలోని కళ్యాణదుర్గం కేంద్రంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా నిర్మాణ మహాసభలు 19, 20వ తేదీల్లో నిర్వహించనున్నట్లు ఆ సంఘం నాయకులు తెలిపారు. ఆదివారం ఆ సంఘం కార్యాలయంలో మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు రమణయ్య, ప్రధానకార్యదర్శి కుళ్లాయిస్వామి మాట్లాడుతూ విద్యారంగానికి దేశ బడ్జెట్‌లో 10 శాతం, రాష్ట్ర బడ్జెట్‌లో 30 శాతం కేటాయించాలన్నారు. హాస్టళ్లలోని సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. కాస్మెటిక్ చార్జీలు విడుదల చేయాలని, పెండింగ్ మెస్ చార్జీలు చెల్లించాలని డిమాండ్ చేశారు. నరసింహయాదవ్, వంశీ, మంజునాథ్, తారక్, రారాజు, విజయ్, తరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఎల్ఐసీ వారోత్సవాలను విజయవంతం చేయండి

అనంతపురం సెంట్రల్, సెప్టెంబరు 1: జీవిత బీమా సంస్థ(ఎల్ఐసీ) 68వ వారోత్సవాలను విజయవంతం చేయాలని ఏజెంట్ల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆదిశేషయ్య, చెరుకుతోట జగదీష్ ఆదివారం ప్రకటనలో కోరారు. ఫ్యామిలీ ప్రొటెక్ట్, హెల్త్, వెల్త్, ఫ్యూచర్ ప్లానింగ్, రిటైర్‌మెంట్ ప్లానింగ్ ద్వారా ప్రజలకు సేవలందిస్తున్న ఎల్ఐసీ.. దేశంలోనే అత్యధిక పాలసీదారులున్న సంస్థగా రికార్డు సృష్టించిందన్నారు. పాలసీ నిబంధనల మేరకు సకాలంలో చెల్లింపులుచేస్తూ ప్రజల మన్ననలు పొందుతూ వస్తుందన్నారు. వారోత్సవాలను పాలసీదారులు, ఏజెంట్లు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

రైతాంగం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

- ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున



మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున

అనంతపురంరూరల్, సెప్టెంబరు 1: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతాంగం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున కోరారు. మండలంలోని మన్నీల గ్రామంలో ఆదివారం రైతు సంఘం రాప్తాడు నియోజకవర్గ కార్యనిర్వాహక అధ్యక్షుడు వెంకటరాముడు అధ్యక్షతన జాతీయ కోర్కెల దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి మల్లికార్జున, రామకృష్ణ హాజరై మాట్లాడారు. 2014లో అధికారంలోకి వచ్చిన తరువాత రైతాంగం లాభసాటిగా మారుస్తామన్న మోదీ నేటికీ అమలు చేయకపోవడం బాధాకరమన్నారు. కూటమి ప్రభుత్వం పెట్టుబడి సాయం రూ.20వేలు ఇస్తామని ఇంత వరకు అమలు చేయలేదన్నారు. ఖరీఫ్ ప్రారంభమై మూడు నెలలు గడుస్తున్నా పెట్టుబడి సాయం చేయకపోవడం శోచనీయమన్నారు. నాయకులు రామాంజనేయులు, చలపతి, నగేష్, నారాయణస్వామి, పోలన్న, వెంకటరాముడు, సుబ్బారాయుడు, పెద్దన్న పాల్గొన్నారు.

శింగనమల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుంగ డిమాండ్లను తక్షణమే పరిష్కరించి రైతులను ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్నప్పయాదవ్ డిమాండ్ చేశారు. మండలంలోని నాయనపల్లి క్రాస్‌లో ఆదివారం రైతుంగ కోర్కెల దినం సందర్భంగా ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శివారెడ్డి, ముదుయాదవ్, లలితమ్మ, వెంకటరెడ్డి, నేసే మధు, రామాంజనేయులు, ఓబుళపతి పాల్గొన్నారు.



నాయనపల్లి క్రాస్‌లో జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజా పంపిణీ వ్యవస్థను పటిష్టం చేయాలి

- చక్కెర, కందిబేడలు, గోధుమపిండి ఇవ్వాలి..
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్

అనంతపురం కల్చరల్, సెప్టెంబరు 1: ప్రజా పంపిణీ వ్యవస్థను పటిష్టం చేయాల్సిన అవసరం ఉందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ అన్నారు. స్థానిక గణేనాయక్ భవన్‌లో ఆదివారం సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బాలరంగయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో రాంభూపాల్ మాట్లాడారు. కార్డుదారులకు ప్రతినెలా బియ్యంతోపాటు చక్కెర, కందిపప్పు, గోధుమపిండి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రజాపంపిణీ వ్యవస్థను పటిష్టం చేస్తామని, కొలతల్లో అక్రమాలను అరికట్టడంతోపాటు నాణ్యమైన సరుకులను ఇంటివద్దకే అందిస్తామని అధికారంలోకి వచ్చిన తొలిరోజుల్లో రాష్ట్ర మంత్రులు చేసిన హడావుడి ప్రస్తుతం కనిపించడం లేదని విమర్శించారు. వినాయక చవితి పండుగ ఉన్నందున నిత్యావసర సరుకులను చౌకదుకాణాల ద్వారా అందించాలన్నారు. బియ్యంతోపాటు కందిపప్పు, చక్కెర, గోధుమపిండి ఇస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలు ఆచరణలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలతో పట్టణ, గ్రామీణ, పేద, దిగువ, మధ్యతరగతి ప్రజలు కనీసం సరుకులు కొనలేని పరిస్థితి ఉందన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల అమలుకు చిత్తశుద్ధితో కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నల్లప్ప, సావిత్రి, నాగేంద్ర, జిల్లా కమిటీ సభ్యులు రామిరెడ్డి, కృష్ణమూర్తి, చంద్రశేఖర్‌రెడ్డి, తరిమెల నాగరాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాంభూపాల్



పూలు, రంగవల్లులతో దేవతారూపం

శాస్త్రోక్తంగా మహా చండీయాగం

అనంతపురం కల్చరల్, సెప్టెంబరు 1: లోకకల్యాణం కోసం ఆదివారం శారదానగర్‌లోని శృంగేరి శంకరమఠంలో మహాచండీయాగాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ఆవరణలో వివిధ రకాల పుష్పాలు, రంగవల్లులతో దేవతల రూపాలను తీర్చిదిద్దడంతోపాటు కలశపూజలు నిర్వహించారు. అనంతరం రుత్వికుల మంత్రోచ్ఛారణల నడుమ గణపతి, నవగ్రహ, చండీ, శాంతి హోమాలు నిర్వహించి పూర్ణాహుతి గావించారు. మహామంగళహారతి నివేదనానంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో మఠం కార్యనిర్వహణాధికారి సత్యప్రసాద్, మోహన్, భక్తులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మాసశివరాత్రి పూజలు



అలంకరణలో కాశీవిశ్వేశ్వరుడు

అనంతపురం కల్చరల్, సెప్టెంబరు 1: మాసశివరాత్రిని పురస్కరించుకుని ఆదివారం సాయంత్రం మొదటిరోడ్డులోని కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలో విశేష పూజలు నిర్వహించారు. కాశీవిశ్వేశ్వరునికి రుద్రాభిషేకం, బిల్వార్చనలు, ప్రత్యేక అలంకరణలు నిర్వహించి పూజాది కైంకర్యాలు చేశారు. ఆలయ ఈఓ రమేష్‌బాబు, అనువంశీకుడు హోసూరు రామసుబ్రహ్మణ్యం, ప్రధానార్చకుడు నరసింహశాస్త్రి, పరమేష్ భక్తులు పాల్గొన్నారు.

అలరించిన రంగప్రవేశం



నృత్యం చేస్తున్న చిన్నారులు

అనంతపురం కల్చరల్, సెప్టెంబరు 1: విద్యుత్‌నగర్ పంచముఖ అంజనేయస్వామి ఆలయంలో ఆదివారం సాయంత్రం కూచిపూడి కళాకేంద్రం, విజయ సింధూరి రంగస్థల వేదిక సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన రంగప్రవేశం వీక్షకులను ఎంతగానో అలరించింది. చిన్నారులు జెనీషారెడ్డి, దేవాంక్షిత, మోక్షశ్రీ, యశస్విని, తనుశ్రీ శాస్త్రీయ సంగీతానికి సంప్రదాయ నృత్యాలతో అలరించారు. అనంతరం చిన్నారులకు జ్ఞాపికలు అందజేసి సత్కరించారు. నాట్యకళాకారిణి యామిని, నాట్యాచార్యుడు కృష్ణమూర్తిరాజు, ఆలయ ధర్మకర్తలు మోహన్‌రావు, వేణుగోపాల్, శ్రీదేవి, నందకుమార్, మస్తాన్‌వలి పాల్గొన్నారు.

నాటో దేశాల సామ్రాజ్యవాదం నశించాలి



నగరంలో కొవ్వొత్తుల ర్యాలీ చేస్తున్న ప్రజాసంఘాలు

అనంతపురం కల్చరల్, సెప్టెంబరు 1: అమెరికా నాటో దేశాల సామ్రాజ్యవాదం నశించాలని ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్ అన్నారు. ప్రపంచ శాంతి కార్యాచరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం సాయంత్రం ఐద్వా, సీఐటీయూ, డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, పీఎన్ఎం ప్రజా సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో లలితకళా పరిషత్ నుంచి క్లాక్‌టవర్ వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ పాలస్తీనా, ఉక్రెయిన్‌లలో యుద్ధాలను అమెరికా నాయకత్వంలో సామ్రాజ్యవాదం ప్రోత్సహిస్తూ ఇజ్రాయెల్ దేశానికి అమెరికా ఆయుధాలను సరఫరా చేస్తోందని, ఇప్పటికి 40వేల మందికిపైగా పాలస్తీనా పౌరుల ప్రాణాలను బలిగొన్నారన్నారు. మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ మాట్లాడుతూ యుద్ధం వల్ల ప్రపంచ దేశాల్లో నిత్యావసరాల ధరలు పెరుగుతున్నాయన్నారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు నాగమణి, కోశాధికారి గోపాల్, రాజమోహన్, రామాంజనేయులు, వెంకటనారాయణ, రామిరెడ్డి పాల్గొన్నారు.

కొనసాగుతున్న తాగునీటి కార్మికుల సమ్మె



కల్లూరు పంపుహౌస్ వద్ద అర్ధనగ్న ప్రదర్శన చేస్తున్న కార్మికులు

గార్లదిన్నె, సెప్టెంబరు 1: బకాయి వేతనాలు చెల్లించాలని సత్యసాయి తాగునీటి కార్మికులు చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. ఆదివారం 11వ రోజు కావడంతో కల్లూరులోని సత్యసాయి తాగునీటి పంపుహౌస్ వద్ద కార్మికులు అర్ధనగ్నతో మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. తమకు అందాల్సిన 6 నెలలు బకాయి వేతనాలు చెల్లించాలని సంబంధిత అధికారులకు విన్నవించినా ఫలితం లేదన్నారు. కుటుంబ పోషణ భారంగా మారిందన్నారు. అధికారులు, పాలకులు స్పందించి వేతనాలు త్వరగా అందేలా చూడాలని కోరారు. నాగభూషణం, మల్లరాయుడు, బాషా, శంకర్, సాంబశివ, నాగేశ్వరరావు, జనార్ధన్‌రెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

విద్యార్థులకు న్యాయం చేయాలి

అనంతపురం సెంట్రల్, సెప్టెంబరు 1: గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు న్యాయం చేయాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంఘాల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం అంబేడ్కర్ విగ్రహంవద్ద నిరసన తెలిపారు. కార్యక్రమంలో సాకేహరి, నాయకులు, అంజి, రాజు, హనుమంతు పాల్గొన్నారు.

6న పెరిగిన ధరలపై ఆందోళన

అనంతపురం విద్య, సెప్టెంబరు 1: బీజేపీ పాలనలో సామాన్యులు జీవించలేని దుస్థితి నెలకొందని, పెరిగిన ధరలపై 6వ తేదీన ఆందోళన చేయనున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ తెలిపారు. సీపీఐ ఆఫీస్‌లో ఆందోళన పోస్టర్లను ఆదివారం ఆవిష్కరించారు. జాఫర్ మాట్లాడుతూ దేశంలో సామాన్యులు బతికే పరిస్థితి లేదన్నారు. నిత్యావసర సరుకుల ధరలు భారీగా పెరిగాయన్నారు. కేంద్రంలోని బీజేపీ పెట్టుబడుదారులకు అనుకూలంగా నిర్ణయాలు తీసుకోవడం వల్ల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయన్నారు. వెంటనే ధరలు తగ్గించాలని 6న కలెక్టరేట్ వద్ద సీపీఐ, అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేయనున్నట్టు స్పష్టం చేశారు. లింగమయ్య, నారాయణస్వామి, శ్రీరాములు, సంతోష్, కుళ్లాయిస్వామి పాల్గొన్నారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

పుట్లూరు చెరువు పరిశీలన

పుట్లూరు, సెప్టెంబరు1: వరదల నేపథ్యంలో మండలకేంద్రంలోని చెరువును తహసీల్దార్ శేషారెడ్డి, ఎంపీడీఓ యోగానందరెడ్డితోపాటు హెచ్చెల్సీ అధికారులు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. తుఫాన్ నేపథ్యంలో వరదనీరు వస్తే కింద చెరువులకు నీటిని విడుదల చేస్తామన్నారు. అలాగే చెరువుకు గండ్లు పడకుండా ముందుజాగ్రత్త చర్యలు తీసుకున్నామని తెలిపారు.

సీఐ మనోహర్‌కు సన్మానం

గుంతకల్లుటౌన్ సెప్టెంబరు1: పట్టణంలోని వన్‌టౌన్ సీఐగా బాధ్యతలు స్వీకరించిన మనోహర్‌ను తెలుగు యువత పట్టణ అధ్యక్షుడు బీ రాము ఆదివారం సన్మానం చేశారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన సీఐను కలిసి శాలువా కప్పి పూలమాలతో సత్కరించారు. అనంతరం మాట్లాడుతూ పట్టణంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో తెలుగు యువత నాయకులు పాల్గొన్నారు.

అర్హులకు కొత్త రేషన్ కార్డులివ్వాలి

గుంతకల్లుటౌన్ సెప్టెంబరు1: అర్హులకు కొత్త రేషన్ కార్డులు ఇవ్వాలని, ప్రజా పంపిణీ వ్యవస్థను ప్రతిష్ఠ పరచాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు గోవిందు కోరారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడారు. నిత్యావసర వస్తువులు పెరిగాయని, వాటిని తగ్గించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఆహార భద్రత చట్టాన్ని కచ్చితంగా అమలు చేయాలని, పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. అలాగే అర్హులకు కొత్తరేషన్‌కార్డులు ఇవ్వాలన్నారు. ఈ మేరకు ఈనెల 6వ తేదీ వరకు దేశవ్యాప్త ఆందోళనలు చేపడుతున్నామని చెప్పారు. అందుకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి వీరభద్ర స్వామి, సహాయ కార్యదర్శులు మహేష్, ఎస్ఎండీ గౌస్, పట్టణ కార్యదర్శి గోపీనాథ్, నాయకులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాల కూల్చివేత

కళ్యాణదుర్గం, సెప్టెంబరు 1: పట్టణంలో అక్రమ కట్టడాలపై మున్సిపల్ అధికారులు కన్నెర్ర చేశారు. మున్సిపల్ కమిషనర్‌గా విజయకృష్ణభార్గవ్ బాధ్యతలు తీసుకున్న... వారం రోజులకే ఈ అక్రమ కట్టడాలపై దృష్టి పెట్టారు. ఈ క్రమంలో ఆదివారం స్థానిక సాయిబాబా ఆలయం ఎదురుగా ఉన్న అక్రమ కట్టడాలను ఎక్స్‌కవేటర్ సాయంతో పడగొట్టారు. కొందరు డ్రైనేజీకి అనుసంధానం చేసి, అక్రమంగా ఇళ్ల నిర్మాణం చేపట్టడంతో వారికి మున్సిపల్ అధికారులు పలు మార్లు నోటీసులు అందజేశారు. అయినా స్పందించకపోవడంతో అధికారులు నిర్మాణాలను నేలమట్టం చేశారు. మున్సిపల్ అధికారుల పనితీరుపై పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అనుమతులు లేకుండా అక్రమ కట్టడాలు నిర్మిస్తే కూల్చివేస్తామని మున్సిపల్ అధికారులు హెచ్చరించారు.

జనసేన ఆధ్వర్యంలో రక్తదానం

గుంతకల్లుటౌన్ సెప్టెంబరు1: జనసేన అధినేత, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద జనసేన మండల అధ్యక్షుడు కురుబ పురషోత్తం ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. జనసేన అభిమానులు 110 మంది రక్తదానం చేశారు. బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు మంజుల వెంకటేష్ 76వ సారి రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య, జనసేన నాయకులు మణికంఠ, పూలరమణ, జీవన్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు బండారు ఆనంద్, లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి బీఎస్ కృష్ణారెడి తదితరులు పాల్గొన్నారు.


కంపచెట్ల తొలగింపు

పామిడి, సెప్టెంబరు 1: మండలంలోని దేవరపల్లి నుంచి అనుంపల్లికి వెళ్లే రోడ్డుకు ఇరువైపులా కంపచెట్లు ఏపుగా పెరిగాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించాలంటే ఇబ్బంది పడుతుండేవారు. వారి అవస్థలను తెలుసుకున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం తనయుడు, టీడీపీ మండల ఇన్‌చార్జి గుమ్మనూరు ఈశ్వర్ కంపచెట్లు తొలగించేందుకు శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా తన సొంతనిధులతో ఆదివారం ఎక్స్‌కవేటర్‌తో రోడ్డుకు ఇరువైపులా ఉన్న కంపచెట్లును తొలగింపజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దేవదాసు, పురుషోత్తం, రామాంజనేయులు, అర్జున్, వెంకటరాముడు, హోటల్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఉడేగోళంలో యువకుడి ఆత్మహత్య


కణేకల్లు, సెప్టెంబరు 1 : మండలంలోని ఉడేగోళం గ్రామంలో బోయచిక్కణ్ణ(30) అనే వ్యక్తి ఆదివారం తెల్లవారుజామున ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామానికి చెందిన చిక్కణ్ణ మద్యానికి బానిసయ్యాడు. చివరకు ఇంట్లో వున్న బియ్యాన్ని కూడా అమ్ముకుని మద్యం సేవిస్తుండేవాడు. మద్యం మానేయాలని భార్య లక్ష్మి పలుసార్లు బతిమిలాడింది. చిక్కణ్ణ వినలేదు. విసుగు చెందిన భార్య ఈనెల 29వ తేదీన తన పిల్లలను తోలుకుని పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో చిక్కణ్ణ తల్లి మారెక్క కుమారుడిని మందలించింది. మద్యానికి బానిసై కుటుంబాన్ని కూడా వదులుకున్నావని కోప్పడింది. భార్య పుట్టింటికిపోవడం, తల్లిమందలించడంతో మనస్థాపానికి గురైన అతను పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన బంధువులు వెంటనే బళ్లారి విమ్స్ ఆస్పత్రికు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

అనారోగ్యంతో హెచ్ఎం మృతి


పంపాపతి (ఫైల్)

కుందుర్పి, సెప్టెంబరు 1: మండలంలోని ఎనుములదొడ్డి గ్రామానికి చెందిన చెందిన ప్రధానోపాధ్యాయుడు పంపాపతి అనారోగ్యంతో ఆదివారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మండల కేంద్రంలోని విద్యుత్‌నగర్‌లో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తుండేవారు. అనారోగ్యం భారిన పడ్డ ఆయన బెంగళూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి


సుజాతమ్మ(ఫైల్)

గుత్తి, సెప్టెంబరు1: పట్టణంలోని వివేకానంద నగర్ కాలనీకి చెందిన సుజాతమ్మ(41) విద్యుదాఘాతంతో ఆదివారం మృతి చెం దింది. గుత్తి చెరువు ఆయకట్టు మాజీ చైర్మన్ కేశవనాయుడు సతీమణి సుజాతమ్మ ఉదయం స్నానానికి నీటిని వేడి చేసేందుకు హీటర్ పెడుతుండగా.. ప్రమాదవశాత్తూ విద్యుత్ షాక్ తగలి కింద పడింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి ఆమె అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు. విషయం తెలుసుకున్న టీడీపీ గుత్తి ఇన్‌చార్జి నారాయణతో పాటు నాయకులు సంతాపం తెలిపారు.

విధులకు హాజరుకాని వారిపై చర్యలు తీసుకోండి

- కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశం
- పెద్దవడుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ


ఆర్డీటీ కాలనీలో గర్భిణితో మాట్లాడుతున్న కలెక్టర్

పెద్దవడుగూరు, సెప్టెంబరు 1: ఆరోగ్య కేంద్రంలో విధులకు హాజరుకాని వారిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని కలెక్టర్ ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడ అందుతున్న వైద్యసేవల గురించి రోగులను అడిగితెలుసుకున్నారు. పలువురు వైద్యసిబ్బంది విధులకు హాజరుకాని విషయం తెలుసుకున్న ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. గైర్హాజరైన సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం అక్కడ నూతనంగా చేపడుతున్న గదుల నిర్మాణాన్ని పరిశీలించి వేగవంతంగా పూర్తిచేయాలని కాంట్రాక్టర్‌కు తెలిపారు. తర్వాత ఆర్డీటీ కాలనీలో పర్యటించి స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. బింధు అనే గర్భిణి తమకు నివాస గృహం లేదని, మంజూరు చేయాలని కోరగా.. ఇంటి మంజూరుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం మాట్లాడుతూ స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తుఫాన్ హెచ్చరిక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని రెవెన్యూ సిబ్బందికి సూచించారు. వర్షాలు కురుస్తుండడంతో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట డిప్యూటీ తహశీల్దార్ వెంకటేశ్వరమ్మ, ఎంపీడీఓ కుళ్లాయిస్వామి, ఎస్ఐ రెడ్డప్ప, వైద్యుడు శ్రీనివాసబాబు, ఎంఈఓ రాముడు తదితరులు ఉన్నారు.

రైతాంగ సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

గుంతకల్లుటౌన్ సెప్టెంబరు 1: రైతాంగ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఏపీ రైతు సంఘం జిల్లా వర్కింగ్ అధ్యక్షుడు బీ గోవిందు కోరారు. రైతాంగ కోర్కెల దినోత్సవం సందర్భంగా మండలంలోని జీ కొట్టాల గ్రామ సమీపంలోని హంద్రీనీవా కాలువ వద్ద సంఘం నియోజకవర్గ కార్యదర్శి రామాంజనేయులు యా దవ్ ఆధ్వర్యంలో ఆదివారం సమావేశం జరిగింది. ఇందు లో గోవిందు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతాంగ సమస్యలు పరిష్కరించడంలో పూర్తిగా విఫలం చెందారన్నారు. వ్యవసాయ మోటార్లకు స్మార్ట్ మీటర్లు బిగించే పక్రియను రద్దు చేయాలన్నారు. ప్రతి రైతుకు సాగు సాయం కింద తక్షణమే రూ. 20వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి, సహాయ కార్యదర్శి మహేష్, పట్టణ కార్యదర్శి గోపీనాథ్, నాయకులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోండి

పుట్లూరు: రైతులను ఆదుకోవాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట రైతు కోర్కెల దినోత్సవం సందర్భంగా వారు జెండా ఎగురవేశారు. అనంతరం సంఘం నాయకుడు రామాంజనేయులు మాట్లాడుతూ రైతులు అనేక విపత్తుల్లో నష్టపోతే ప్రభుత్వాలు ఆదుకున్న దాఖలాలు లేవన్నారు. ఇప్పటికైనా ఆదుకోవాలని, రైతుల డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో గోపాల్, బాలగురయ్య తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ రంగాన్ని ఆదుకోవాలి

పెద్దవడుగూరు: సంక్షోభంలో ఉన్న వ్యవసాయ రంగాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటరాముడు యాదవ్, సీనియర్ నాయకులు నారాయణ, శ్రీరాములు కోరారు. మండలంలోని కిష్టిపాడు గ్రామంలో ఆదివారం వారు రైతు దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. ప్రతి ఏడాది రైతుల ఆత్మహత్యలు పెరుగుతూనే ఉన్నాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు స్పందించి ఆదుకోవాలని కోరారు. నాయకులు ఓబిరెడ్డి, ఆదినారాయణ, రఫీ, శ్రీనివాస్‌రెడ్డి, రఘురామయ్య, మల్లికార్జున, నారాయణ, హుస్సేన్, పీరా, రంగయ్య, రంగస్వామి, సుధాకర్‌గౌడ్, నాగేంద్ర, ముత్యాలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కూడేరు: మండలకేంద్రంలోని సీపీఐ కాలనీలో రైతు దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల సమస్యల్ని పరిష్కరించాలని, వారిని ఆదుకోవాలని కోరారు. నాయకులు వరప్రసాద్, రమణ, సంగప్ప, రమణప్ప, నారాయణమ్మ, భీమన్న, మలరాయుడు, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం


ఉరవకొండలో పూర్వ విద్యార్థులు

ఉరవకొండ, సెప్టెంబరు 1: వజ్రకరూరు మండల కేంద్రంలోని కాటవెంకటప్ప జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వవిద్యార్థుల సమ్మేళనం జరిగింది. సుమారు 60 ఏళ్ల కిందట ఆ పాఠశాలలో ఎస్ఎస్ఎల్‌సీ చదివిన విద్యార్థులు మళ్లీ ఇన్నేళ్లకు ఒక్కటిగా కలిశారు. ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. తర్వాత పాఠశాలలో మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంఈఓలు ఎర్రిస్వామి, తిమ్మప్ప, హెచ్ఎం స్వర్ణలత, సర్పంచు మోనాలిసా, తదితరులు పాల్గొన్నారు.

పామిడి : పట్టణంలోని టీసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వవిద్యార్థుల సమ్మేళనం జరిగింది. ఇందులో ఆ పాఠశాలలో 1980-81వ విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు సుమారు 44 ఏళ్ల తర్వాత అందరూ ఒకచోట కలిశారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. తర్వాత తమకు చదువు చెప్పిన ఉపాధ్యాయులు మృతి చెందడంతో వారిని గుర్తు చేసుకుని అంజలి ఘటించారు. అనంతరం సామూహిక భోజనాలు చేశారు.

గుంతకల్లు: పట్టణంలోని రైల్వే ఉన్నత పాఠశాలలో 2003లో పదో తరగతి చదివిన విద్యార్థులు గెట్‌టూగెదర్ నిర్వహించారు. సుమారు 21 సంవత్సరాల తర్వాత అందరూ కలిసి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తర్వాత తమ గురువులు మధుసూదన్, సుధాకర్, మహమ్మద్ రఫీక్, సాయికుమారి, గుప్తా, సాధిక్, గజేంద్రబాబు, రమణారావులను పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. పూర్వ విద్యార్థులు సుమన, కిరణ్, మహమ్మద్, లక్ష్మీ ప్రకాశ్, ఆలీ, రూపమ్మ తదితరులు పాల్గొన్నారు.

బెంగళూరు టీడీపీ ఫోరం సేవలు భేష్: ఎమ్మెల్యే అమిలినేని


బెంగళూరులోని సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అమిలినేని

కళ్యాణదుర్గం, సెప్టెంబరు 1: ఎన్నికల సమయంలో కూటమి అధికారంలోకి రావాలన్న సంకల్పంతో బెంగళూరుకు చెందిన టీడీపీ ఫోరం చాలా నియోజకవర్గాల్లో సేవలు అందించిందని, ఇందుకు ఫోరం సభ్యులకు కృతజ్ఞతలని కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు తెలిపారు. బెంగళూరు కేఆర్‌పురంలోని ఎంటీబీ కల్యాణ మండపంలో ఆదివారం బెంగళూరు టీడీపీ ఫోరం11వ వార్షికోత్సవం సందర్భంగా నవశకం కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఇందుకు రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖా మంత్రి సవితమ్మ, ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఎమ్మెల్యే అమిలినేని మాట్లాడుతూ.. రాష్ట్రంలో కూటమి అధికారంలోకి రావడానికి బెంగళూరు టీడీపీ ఫోరం సభ్యులు తమ వంతుగా విశేష కృషి చేశారన్నారు. ప్రతి నియోజకవర్గంలోనూ తిరిగి చంద్రబాబు సీఎం అయితే కలిగే ప్రయోజనాల గురించి ప్రజలకు వివరించారన్నారు. ఇలాగే మున్ముందు పార్టీ కోసం కష్టపడాలని, తప్పకుండా ప్రతి ఒక్కరినీ పార్టీ గుర్తుంచుకుంటుందని పేర్కొన్నారు. అనంతరం నందమూరి బాలకృష్ణ సినీ రంగంలోకి వచ్చి 50 వసంతాలు పూర్తయిన సందర్భంగా బాలకృష్ణ సినీ స్వర్ణోత్సవ పోస్టర్‌ను విడుదల చేశారు.

జిల్లా జట్ల ఎంపిక

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 1: జిల్లా టెన్నీకాయిట్ సబ్‌జూనియర్ బాల, బాలికల జట్లను కళ్యాణదుర్గంలో ఆదివారం ఎంపిక చేసినట్లు టెన్నీకాయిట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రజాక్, రంగస్వామి తెలిపారు. ఎంపికైన సబ్‌జూనియర్ బాలుర జట్టులో.. మహిధర్, లతీఫ్, చనిత్‌రాజ్, బాబామహబూబ్ ఉన్నారు. బాలికల జట్టులో జ్యోతిక, స్పందన, పూజ ఉన్నారు. ఎంపికైన జట్లు ఈనెల 16వతేదీన శ్రీకాకుళంలో నిర్వహించే రాష్ట్రస్థాయి టెన్నీకాయిట్ పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో పీడీలు అమరాంజనేయులు, షణ్ముఖ, శ్రీనివాసులు, రమేష్, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

దోమతెరల పంపిణీ

తాడిపత్రి, సెప్టెంబరు1: పట్టణంలోని భగత్ సింగ్ నగర్‌లో ఉన్న ప్రభుత్వ బాలికల ఎస్సీ హాస్టల్‌కు ఉద్యోగ ఉపాధ్యాయ సేవా సంస్థ వారు దోమతెరలను పంపిణీ చేశారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా దోమల నుంచి రక్షణ పొందేందుకు గాను 80మంది విద్యార్థినుల కోసం రూ.6వేలు విలువ గల దోమతెరలను పంపిణీచేసినట్లు సంస్థ అధ్యక్షుడు గుర్రప్ప తెలిపారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ సువర్ణ, సంస్థ సభ్యులు శంకర్, కుమారస్వామి, రామేశ్వర్‌రెడ్డి, జాఫర్ పాల్గొన్నారు.

పామిడిలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

పామిడి, సెప్టెంబరు 1: భారీ వర్షాల నేపథ్యంలో ప్రజల సౌకర్యార్థం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మినారాయణరెడ్డి ఆదివారం ప్రకటనలో తెలిపారు. రానున్న మూడు రోజుల పాటు భారీ వర్ష సూచన ఉండడంతో ఈ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశామన్నారు. విపత్కర పరిస్థితులలో ప్రజలు ఈ కంట్రోల్ రూమ్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నిండుకుండలా జీడిపల్లి రిజర్వాయర్


కృష్ణాజలాలతో నిండిన జీడిపల్లి రిజర్వాయర్

బెళుగుప్ప, సెప్టెంబరు 1: మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్ కృష్ణాజలాలతో పూర్తిస్థాయిలో నిండింది. దీంతో నిండుకుండలా తొణికిసలాడుతోంది. రిజర్వాయర్‌లో నీటి సామర్థ్యం 1.681 టీఎంసీలు కాగా ఆదివారం 900 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోందని హంద్రీనీవా అధికారులు తెలిపారు. హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-2కు 400 క్యూసెక్కులు నీటిని ఔట్‌ఫ్లో ద్వారా వదలడంతో మరువ నుంచి పీఏబీఆర్‌కు 400 క్యూసెక్కులు వెళుతున్నట్లు వారు చెప్పారు.

పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలి: ఏపీటీఎఫ్



తాడిపత్రి తహసీల్దార్ కార్యాలయం వద్ద వినతిపత్రం ఇస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

తాడిపత్రి, సెప్టెంబరు1: ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరుతూ పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆదివారం ఏపీటీఎఫ్ నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు రఘురామిరెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం యూపీఎస్‌ను అమలులోకి తెస్తామని చెబుతోందని, దీనివల్ల తమకు ఎలాంటి ప్రయోజనం ఉండదని అన్నారు. పాత పెన్షన్ విధానం ద్వారానే లబ్ధిచేకూరుతుందన్నారు. 117 జీవోను రద్దుచేస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం కాలయాపన చేస్తోందన్నారు. 12వ వేతన సవరణపై నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం అధికారులకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఫెడరేషన్ నాయకులు జయచంద్ర, ఉపేంద్ర, రామాంజనేయులు, అంకాల్‌యాదవ్, శివుడు, నటరాజ తదితరులు పాల్గొన్నారు.

గుత్తి: పట్టణంలోని తహసీల్దారు కార్యాలయం ఎదుట ఏపీటీఎఫ్ గుత్తి మండల శాఖ నాయకులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన యూపీఎస్ పెన్షన్ విధానం వద్దని, సీపీఎస్ ముద్దు అని నినాదాలు చేశారు. పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం రెవెన్యూ అధికారులకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు దేశాయ్‌నాగరాజు, సయ్యద్‌బాషా, బాలరాజు, పులికొండ, కిరణ్, జయకుమార్, రామచంద్రుడు, వెంకటప్ప తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం : 2004 సెప్టెంబర్ 1 వతేదీ సీపీఎస్ ఉద్యోగులకు చీకటి రోజని ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి తలారి రామాంజినేయులు తెలిపారు. సీపీఎస్‌కు వ్యతిరేకంగా పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఉపాధ్యాయులు ధర్నా చేశారు. గంట పాటు బైఠాయించి నిరసన తెలిపారు. పలువురు మాట్లాడుతూ సీపీఎస్ జీపీఎస్, యూపీఎస్ లు ఏపీ ఉద్యోగ ఉపాధ్యాయులకు ఆమోద యోగ్యం కాదన్నారు. కేంద్రం ప్రవేశపెట్టిన యూపీఎస్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లో అమలు పరచకూడదని డిమాండ్ చేశారు. పాత పెన్షన్ విధానాన్నే అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు మోహన్‌రెడ్డి, రామకృష్ణ, పాండు, అనిల్‌కుమార్, ఖాసీం తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

- రైతులకు ఉద్యానశాఖ జిల్లా అధికారి నరసింహారావు సూచన


పొలంలో రైతులతో మాట్లాడుతున్న నరసింహారావు

గుత్తిరూరల్, సెప్టెంబరు 1 : ఉద్యాన పంటల సాగులో రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని ఉద్యాన శాఖ జిల్లా అధికారి నరసింహారావు సూచించారు. మండలంలోని కొత్తపేట గ్రామంలో సాగవుతున్న బత్తాయి, టమాట, మిరప తదితర పంటలను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ప్రస్తుతం అధిక వర్షాల నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. వేరు కుళ్లిపోవడము, పోషకాలను వేరు ద్వారా తీసుకోలేని పరిస్థితుల్లో ఉంటే యూరియాను నీళ్లలో కలిపి మొక్కలపై పిచికారీ చేయాలని సూచించారు. పొలంలో నిలిచిన వర్షపు నీటిని వెంటనే బయటకు పంపివేయాలన్నారు. భూమిలో తడి ఆరిన వెంటనే రసాయన ఎరువులను వేసుకోవాలన్నారు. అంతర సేద్యం చేసి కలుపు తొలగించుకోవాలని తెలిపారు. ఆయన వెంట గుత్తి ఉద్యాన అధికారి మిత్రవింద మాధవి, రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు ఉన్నారు.

ఉద్యాన రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి

యాడికి: వర్షప్రభావిత ప్రాంత ఉద్యాన రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఉద్యాన శాఖ అధికారి ఉమాదేవి ఆదివారం ప్రకటనలో తెలిపారు. రెండురోజుల నుంచి వర్షాలు కురుస్తుండడంతో ఉద్యాన పంటలు దెబ్బతినే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా అరటిరైతులు నిలవ ఉన్న అదనపు నీటిని బయటకు పంపి వేయాలన్నారు. ఈదురుగాలులకు విరిగిపోయిన అరటితోటలో గెలలు ఉన్నట్లయితే, వాటిని కోసి మార్కెట్ చేసుకోవాలన్నారు. పంట తెగుళ్లబారిన పడకుండా ముందస్తుగా సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు.

అప్రమత్తంగా ఉండాలి

బొమ్మనహాళ్: తుఫాను ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు రైతులు అప్రమత్తంగా ఉండాలని రాయదుర్గం ఉద్యాన అధికారిణి మౌనిక సూచించారు. మండలంలోని పలు గ్రామాల్లో ఉద్యాన పంటల్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ ఇప్పటివరకు కురిసిన వర్షానికి మండలంలో పంటలకు ఎలాంటి నష్టం వాటిల్లలేదన్నారు. అధిక వర్షాలు వచ్చినప్పుడు అవసరమైతే పంట పొలాల చుట్టూ తాత్కాలిక కాలువలు నిర్మించి అదనపు నీరును బయటికి తరలించాలని సూచించారు. కూరగాయలు, పువ్వులు, పండ్లు వంటి సున్నితమైన పంటలను ప్లాస్టిక్ షీట్లతో కప్పుతూ రక్షించుకోవాలన్నారు. పంటలు కోత చేసిన తరువాత సురక్షితమైన చోట నిల్వ చేసుకోవాలన్నారు. మిర్చి పంటలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని రైతులకు సూచించారు.

గణేష్ మండపాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

తాడిపత్రి, సెప్టెంబరు1: వినాయక చవితిని పురస్కరించుకుని వినాయక మండపాల నిర్వాహకులు పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి ఆదివారం ప్రకటనలో తెలిపారు. నిర్వాహకులు ganeshutsav.net, ganeshutsav.appolice.gov.in వెబ్‌సైట్‌లో లాగిన్ అయి వివరాలను నమోదు చేయాలన్నారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న వివరాలను రెవెన్యూ, ఫైర్, పోలీసు, ట్రాన్స్‌కో తదితర శాఖల అధికారులు పరిశీలించి అనుమతులు ఇస్తారని తెలిపారు. నిర్వాహకులు ఎవరూ కార్యాలయాల చుట్టూ తిరగవలసిన పనిలేదని చెప్పారు.

గ్రామాల్లో పర్యటించిన సీఐ

మండలంలోని గంగాదేవిపల్లి, పులిప్రొద్దుటూరు, చుక్కలూరు, ఇగుడూరు తదితర గ్రామాల్లో రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ఆయా గ్రామస్థులతో మాట్లాడి శాంతిభద్రతలపై ఆరా తీశారు. ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

భారీ వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండండి


సమీక్షలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్

రాయదుర్గం, సెప్టెంబరు 1 : నాలుగు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే పరిస్థితులు ఉన్నాయని, అప్రమత్తంగా ఉండి ప్రజలకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా జాగ్రత్తపడాలని మున్సిపల్ కమిషనర్ దివాకరరెడ్డి ఆదేశించారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఆదివారం ఆయన ముందస్తు చర్యలలో భాగంగా శానిటేషన్, ప్లానింగ్‌పై సచివాలయాల సెక్రెటరీలతో సమీక్షించి ఈ మేరకు ఆదేశాలు ఇచ్చారు. అనంతరం పట్టణంలో గల పలు ప్రాంతాలను పరిశీలించారు. అప్పటికప్పుడు జేసీబీని ఏర్పాటు చేసి సత్యనారాయణ స్వామి గుడి ఏరియా వద్ద గల ప్రధాన కాలువకు పూడికతీత పనులు చేయించారు. అలాగే ముంపు ప్రాంతాలైన మధు టాకీస్ ఏరియా, పుట్టప్పతోట, సీతమ్మకుంట, సత్యనారాయణ స్వామి టెంపుల్ ఏరియా, కొలిమి వీధి, చికెన్ మార్కెట్ ఏరియాలను పరిశీలించారు. వార్డు పరిధిలోని కాలువల్లో ఉన్న పూడికను, బ్లాక్స్‌ను ఎప్పటికప్పుడు తీసివేయాలని శానిటేషన్ సెక్రెటరీని, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను ఆదేశించారు. భారీ వర్ష సూచనలు ఉన్నందున అవసరమైతే తప్ప ఎవరూ బయటకు వెళ్లరాదని ప్రజలకు సూచించారు. మున్సిపల్ కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ రూంను ఏర్పాటు చేశామని, వర్షం వచ్చినప్పుడు సమస్యలు, ఇబ్బందులు ఏమైనా ఎదురైతే 9154566253కు కాల్ చేయాలని తెలిపారు.

వైభవంగా సామూహిక వివాహాలు

బొమ్మనహాళ్, సెప్టెంబరు 1: మండలంలోని హరేసముద్రం గ్రామంలో గ ల సద్గురు నాథ ఆశ్రమంలో ఆదివారం కొనకొండ్ల గురునాథ స్వాములు ఆధ్వర్యంలో సామూహిక వివాహాలు ఘనంగా జరిగాయి. నిరుపేదలైన ఆరు జంటలకు జంటలకు మంగళసూత్రం, కాలి మెట్టెలు, దుస్తులు సమర్పించి వైభవంగా కల్యాణం జరిపించారు. వేద పండితుల వేద మంత్రోచ్చారణల మధ్య ఉదయం 9 నుంచి 10 గంటల శుభముహూర్తంలో ఆరు జంటలు ఒక్కటయ్యాయి. ప్రతియేటా పేద జంటలకు వివాహాలు జరిపిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు బళ్లారి మల్లికార్జున, సుంకన్న, సర్పంచ్ తిప్పేస్వామి, ఉప సర్పంచ్ సుదర్శన్, పూజారి శ్రీరాములు, హనుమంతరెడ్డి, పల్లి రామకృష్ణ, టైలర్ గోవిందు తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

పెద్దవడుగూరు, సెప్టెంబరు1: మండలకేంద్రంలోని నేసే కాలనీ సమీపంలో ఆదివారం పేకాట ఆడుతున్న 8మందిని అరెస్టుచేసి వారివద్ద నుంచి రూ.6180 నగదు స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ రెడ్డప్ప తెలిపారు. అందిన సమాచారం మేరకు సిబ్బందితో దాడిచేసి పేకాటరాయుళ్లను అరెస్టు చేసి కేసు నమోదుచేశామని చెప్పారు.

ఎస్సీ బాలుర వసతి గృహం తనిఖీ

బ్రహ్మసముద్రం, సెప్టెంబరు 1: మండల కేంద్రంలో సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహాన్ని తహసీల్దార్ సుమతి, ఎంపీడీవో దాసానాయక్ ఆదివారం తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడుతూ ఇక్కడ అసౌకర్యంగా ఏమైనా ఉందా అని అడిగి తెలుసుకున్నారు. వర్షపు నీరు హాస్టల్లోకి వచ్చాయా అని ఆరాతీశారు. కార్యక్రమంలో వార్డెన్ శ్రీనివాసులు ఆర్ఐ నాగిరెడ్డి పాల్గొన్నారు.

తోటి విద్యార్థులకు ఆర్థిక సాయం

కూడేరు, సెప్టెంబరు 1: ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న తమ తోటి విద్యార్థులకు పూర్వ విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించారు. మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో 1991-1992 వ విద్యా సంవత్సరంలో పదోతరగతి వరకు చదువుకున్న పూర్వవిద్యార్థుల్లో కొందరు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. రాజేశ్వరి, సంకమ్మ, కుంటెన్న ఇబ్బంది పడుతుండగా తోటి విద్యార్థులు ఆదివారం వారిని కలిసి ఒక్కొక్కరికి రూ. పదివేలు అందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మలోబులు, బోజన్న, విజయ్‌కుమార్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు చేపట్టండి

- వైద్యసిబ్బందికి డీఎంహెచ్ఓ ఆదేశం


గర్భిణితో మాట్లాడుతున్న డీఎం హెచ్ఓ ఈబీ దేవి

యాడికి, సెప్టెంబరు1: వర్షాల కారణంగా వ్యాధులు ప్రబలకుండా ముందస్తు నివారణ చర్యలు చేపట్టాలని డీఎం హెచ్ఓ ఈబీదేవి తెలిపారు. మండలకేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలను ఆదివారం ఆమె తనిఖీచేశారు. పలు రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం అక్కడి గర్భిణుల ఆరోగ్య పరిస్థితిపై ఆరాతీశారు. తర్వాత మాట్లాడుతూ రోగుల నుంచి ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు. ఆమె వెంట డాక్టర్ శ్రీరాంకుమార్, పలువురు సిబ్బంది ఉన్నారు.